# ప్రజా తపన

prajathapana.com

News that matters




సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తీ ఈ సుగుణములతోజాజ్వల్యమానంగా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 117 బుధవారం 21 జూన్ 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


## పేదరికం చదువుకు అడ్డుకారాదు

**ప్రజా తపన ,విజయవాడ :**




విజయవాడలో జగనన్న ఆణి ముత్యాలు కార్యక్రమంలో విద్యార్థులకు అవార్డులను ప్రదానం చేశారు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి. పదో తరగతిలో రాష్ట్ర స్థాయిలో టాపర్స్‌గా నిలిచిన 42 మంది విద్యార్థులకు, ఇంటర్‌లో సత్తా చాటిన 26 మంది విద్యార్థులకు ఈ అవార్డులను సీఎం జగన్ అందించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్థాయిల్లో ప్రతిభ చాటిన 22,710 మంది విద్యార్థులు ఆణిముత్యాల అవార్డులను స్వీకరించారు. ఉన్నత విద్యలో ఐదు కేటగిరీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 20 మంది విద్యార్థులకు స్టేట్ ఎక్సలెన్స్ అవార్డులను ప్రదానం చేశారు. “మీరు వెళ్లే గవర్నమెంట్ బడి నాడు-నేడు ద్వారా రూపురేఖలు మారుతున్నాయి. మిడ్ డే మీల్ కూడా జగనన్న గోరుముద్దగా మార్పులతో అందిస్తున్నాం. బడులు తెరిచే సమయానికి జగనన్న విద్యా కానుక అందిస్తున్నాం. గవర్నమెంట్ బడి నాలుగేళ్లలోనే ఇంగ్లిష్‌కు మీడియం మారింది. ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్‌ఈ సిలబస్ అందుబాటులోకి వచ్చింది. పాఠ్యపుస్తకాలన్నీ సిలబస్ మారాయి. బైలింగ్వువల్ టెక్ట్స్ బుక్స్ తెచ్చాం. బైజూస్ కంటెంట్ గవర్నమెంట్ బడుల్లో అందుబాటు లోకి తెచ్చాం. మనం చదువు కుంటున్న బడుల్లో సదుపాయాలు అన్నీ మారిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. గతంలో క్లాస్ టీచర్లే సరిగ్గా ఉంటారా ఉండరా అనే పరిస్థితుల

03


## అమెరికాతో సంబంధాలు ఇప్పుడు మరింత బలం

**ప్రజా తపన ,న్యూఢిల్లీ :**



అంతర్జాతీయ స్థాయి వివాదాల పరిష్కారం కోసం అన్ని దేశాలు అంతర్జాతీయ చట్టాలను, ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవించాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ సూచించారు. ఎలాంటి వివాదమైనా యుద్ధం ద్వారా గెలిచే బదులు “దౌత్యం సంభాషణ” ద్వారా పరిష్కరించుకోవాలంటూ అన్ని దేశాలకు పిలుపునిచ్చారు. అమెరికా పర్యటనకు ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ.. అమెరికా వార్తాపత్రిక వాల్ స్ట్రీట్ జర్నల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా పలు విషయాల గురించి ప్రధాని మోడీ సుదీర్ఘంగా మాట్లాడారు. పలు ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూనే.. జాతీయ, అంతర్జాతీయ అంశాలపై కీలక వ్యాఖ్యలు చేయడంతోపాటు.. పలు సూచనలు చేశారు.ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. అమెరికాతో సంబంధాలు ఇప్పుడు మరింత బలపడ్డాయని అన్నారు. చైనా ఘర్షణ, ఆ దేశంతో సంబంధాల గురించి కూడా మోడీ మాట్లాడారు.

03



## ప్రజా పార్టీ” పేరుతో గద్దర్ కొత్త పార్టీ

**ప్రజా తపన ,న్యూ ఢిల్లీ :**

“గద్దర్ ప్రజా పార్టీ” పేరుతో గద్దర్ కొత్త పార్టీ పెడుతున్నారు. పార్టీ రిజిస్ట్రేషన్ కోసం ఆయన ఢిల్లీ వెళున్నారు. ఈసీ అధికారులను కలిసి కొత్త పార్టీ రిజిస్ట్రేషన్ ప్రారంభించనున్నారు. గద్దర్ విప్లవానికి పోరాటానికి ప్రతీక. అందువల్లే “గద్దర్ ప్రజా పార్టీ” జెండాను మూడు రంగులతో రూపొందించినట్లు తెలుస్తోంది. అలాగే జెండా మధ్యలో పిడికిలిని పెట్టారని సమాచారం. ఈ మూడు రంగుల్లో ఎరుపు, నీలి, ఆకుపచ్చ రంగులతో రూపొందించారనే ప్రచారం జరుగుతోంది. ఎందుకంటే గద్దర్ తన ప్రయాణాన్ని ఎరుపురంగుతో ప్రారంభించారు. గద్దర్ మొదటగా అంబేద్కరిస్టు.. కాలానుగుణంగా ఆయన వామపక్ష రాజకీయాలపై ఆకర్షితులయ్యారు. అందుకే నీలి రంగు కూడా జెండాలో తప్పకుండా ఉంటుందని భావిస్తున్నారు.గత కొద్ది రోజులుగా రాష్ట్ర రాజకీయాల్లో గద్దర్ ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నారు. ఆ మధ్య వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి లోక్‌సభ స్థానం

03

## రూ.2000 నోట్ల ఉపసంహరణ తో భారీగా తగ్గిన డిజిటల్ పేమెంట్లు

**ప్రజా తపన ,న్యూ ఢిల్లీ :**



రూ.2000 నోట్ల ఉపసంహరణ తో సందేహాలు, అనుమానాలు వ్యక్తమవుతున్న వేళ ప్రభుత్వరంగ బ్యాంక్ ఎస్‌బీఐ కీలక రిపోర్ట్ విడుదల చేసింది. దేశంలో డిపాజిట్లు, రుణాలు, వినియోగంపై ఈ పెద్ద నోటు ఉపసంహరణ గణనీయ ప్రభావాన్ని చూపుతుందని అంచనా వేసింది. వినియోగ డిమాండ్ రూ.55 వేల కోట్ల మొత్తంలో పెరగొచ్చని విశ్లేషించింది. రూ.2 వేల నోటు ఉపసంహరణ ఫలితాల్లో వినియోగ డిమాండ్ తక్షణం పెరుగుదల ఒకటని తెలిపింది. నోట్ల రద్దు మాదిరిగా కాకుండా రూ.2 వేల నోట్లు చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతాయి కాబట్టి ఆర్థిక వ్యవస్థలో వినియోగానికి ఊతమిస్తుందని

03

## మరో వివాదంలో కేదార్ నాథ్ ఆలయం

**ప్రజా తపన ,డెహ్రాడూన్ :**



చార్‌ధామ్ యాత్రల్లో ఒకటైన పవిత్ర కేదార్‌నాథ్ ఆలయంలో అపశ్రుతి చోటు చేసుకుంది. గర్భ గుడిలో ఉన్న శివలింగంపై ఓ మహిళ.. డబ్బులు వెదజల్లడం తీవ్ర వివాదాస్పదంగా మారింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాల్లో వైరల్‌గా మారడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఆ సమయంలో ఆలయ పూజారులు సైతం అక్కడే ఉండి వేద మంత్రాలు పఠించారు. వారు కూడా మహిళను అడ్డుకోకపోవడం తీవ్ర వివాదంగా

03

## రేపు అతిపెద్ద పగటి రోజు

### 13 గంటల 7 నిమిషాలు పగలు

**ప్రజా తపన ,**



నిజమే.. బుధవారం ప్రపంచ వ్యాప్తంగా అతిపెద్ద పగటిపూటను మనం అనుభవించనున్నాం. వినడానికి విడ్డూరంగా ఉన్న జీవ పరిణామ క్రమంలో ఇది నిజమే. సాధారణంగా మనం ప్రతిరోజూ పగటి పూట 8 నుంచి 12 గంటలు అనుభవిస్తాం. అలాంటిది.. జూన్ 21వ తేదీ బుధవారం 13 గంటల 7 నిమిషాలు సుదీర్ఘమైన పగటి సమయం ఉంటుంది. చరిత్రలో అతిపెద్ద పొడవైన రోజులుగా వేసవి కాలాన్ని పేర్కొంటారు. భూమి

03

## రేపటి నుంచి నైరుతి రుతుపవనాలు

**ప్రజా తపన ,హైదరాబాద్ :**



నైరుతి రుతుపవనాలు ఆంధ్రప్రదేశ్ లోని మరికొన్ని భాగాలకు విస్తరించాయి. రాగల 2,3 రోజులలో ద్వీపకల్ప దక్షిణ భారతదేశంలోని మరి కొన్ని భాగాలకు విస్తరించే అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ లోని వాతావరణ కేంద్రం అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం దిగువ స్థాయిలోని గాలులు ముఖ్యంగా వాయువ్య దిశ నుండి తెలంగాణ రాష్ట్రం వైపుకి వీస్తున్నాయి. దీంతో రాగల మూడు రోజులు తెలంగాణ రాష్ట్రంలో తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం

03

**"ప్రజాతపన" పత్రిక ద్వారా నన్ను పాఠకులకు పరిచయం చెయాలనుకొన్న సంపాదక వర్గానికి ధన్యవాదాలు!!**

**ప్రశ్న.జీవితాన్ని మీరు వేటాడారా? జీవితం మిమ్మల్ని వేటాడిందా??**

జవాబు. మొదట నాకు "జీవితం" అంటే ఏమో తెలిసేదికాదు. చిన్నప్పటి నుంచి ఊపిరితిత్తుల జబ్బుతో భయంకరంగా బాధపడడం.....ఏ రోజుకారోజు ఊపిరి నిలుపుకొని బతికితే చాలు అనుకొనే అల్ప సంతోషిని. ఏ ఒక్క ఆశ, ఆశయమూ ఉండేదికాదు. రెక్కలున్న పక్షికయితే గమనము గమ్యస్థానమూ ఉంటాయి కానీ...విహంగం నుంచి ఊడిపోయిన ఈకకు ఏమి ఉంటాయి!! గాలివాటుకు కొట్టుకు పోవడమే.

కాల క్రమంలో నాకంటూ కొన్ని నియమాలూ, సిద్ధాంతాలూ తయారు చేసుకొని, ఎక్కడైతే ఊడి ఈకగా వేరుపడ్డానో మరలా అక్కడికే వెళ్లి రెక్కగా మారి మృగంగా వెంటాడిన జీవితాన్ని వేటాడుతున్నాను.

**ప్రశ్న.సాహిత్య అభిరుచి కలగడానికి ప్రేరణ ఎక్కడిది?**

జవాబు. ఖచ్చితంగా "ఇదే" అని చెప్పలేను కానీ.....చిన్నప్పటి నుంచి నాలో అందరి ఆలోచనలకూ భిన్నమైన భావజాలం ఉండేది. మా నాన్న కూలి బడిలో చదివి మంచి భాషా పటిమ ఉన్నవాడు. భారతం చదివి కరెంటు లేని ఆకాలంలో మా గుడిశెముందు చేరిన గ్రామీణులకు అర్థం చెప్పేవాడు. పాండవుల వనవాసం గురించి చెప్పే సమయంలో అక్కడికి చేరినవారు "పాండవులకు కష్టాలు రాకుండా ఉండాలి" అని మొక్కుకొని.....దుకి?స్తూ సాంబ్రాణి కడ్డు అంటించి టెంకాయ కొట్టడం చూస్తూ ఆశ్చరంతో నవ్వుకొనే వాడిని. అరే ఇది ఇప్పటికే జరిగిపోయిన కథ కదా!! వీరు ఏడిస్తే టెంకాయ కొట్టితే వారికి సమస్యలు రాకుండా ఉంటాయా?? అని.

వానలు రాకుండా ఉంటే..." విరాటపర్వం చదివితే పడతాయి" అని అప్పట్లో ప్రజలు నమ్మేవారు. అలా మా నాన్నను ఇరుగుపొరుగు గ్రామాల రైతులు పిలిపించి చదివించుకొని కొంత గ్రాసం ఇచ్చేవారు. మా ఊళ్లోనూ చదివేవాడు. అయినా కొన్ని సార్లు వర్షాలు పడేవి కావు!! దానిని గమనించి వర్షాలకూ విరాటపర్వానికీ సంబంధం లేదని తర్కించుకొనేవాడిని. చివరికి సరిగా వానలు పడక పంటలు పండక మా కుటుంబమే నీటిజాడ వెతుక్కొంటూ కర్నాటకకు వలస వెళ్ళ వలసి వచ్చింది. ఈ విధంగా నాన్న చెప్పే పురాణాలనూ...నిజజీవన సమస్యలనూ బేరేజు వేసుకొని సమాజానికి యదార్థం వివరించాలని కావచ్చు.

మరీ ముఖ్యంగా నేను చదివే మూడో తరగతిలో అనుకొంటా "తంజా ఊరు" "సామర్లకోట" అనే పాఠాలు ఉండేవి. వాటిని నా వయస్సు అబ్బాయి పుస్తక భాషలో ఉత్తమపురుషలో వివరించేవాడు. అప్పుడు నాకు మా సడ్లపల్లె గురించికానీ, దగ్గరలోని హిందూపురం, లేపాక్షి వంటి వాటి గురించి మా పల్లెప్రజల మాటల్లో ఎందుకు లేవు?? అనే ఆలోచన రేకెత్తేది....ఇటువంటి మరికొన్ని విభిన్న ఆలోచనలే నా రచనలకు ప్రేరణ కావచ్చు.

**ప్రశ్న.మీకున్న అనారోగ్యంతో ఎక్కువ పోరాడారా? జీవితం గడపడానికి ఎక్కువ పోరాడారా??**


జవాబు. చిన్న వయస్సులో అనారోగ్యం పాలు కావడంతో నాన్న అప్పటి కచ్చాకు పుచ్చాకు పూజలు మొక్కుబడుల వంటి వాటిని నమ్మడంతో అది దీర్ఘవ్యాధిగా స్థిరపడి పోయింది. దాని మూలాలు తెలుసుకోవడం,అదుపుచేసుకోవడం, శాస్త్రీయ జ్ఞానంతో తగిన మందులు వాడడం తోనే సగం జీవితం ముగిసిపోయింది.


"తినేటప్పుడు తట్ట....తగేటప్పుడు చెంబు వెతుక్కొనే రకం" అని మా ప్రాంతంలో ఒక నానుడి ఉంది. అలా మా ఊరుకి ఆనుకొని పట్టణం ఉండడంతో డిగ్రీదాకా చదువు, నాకన్నా చాలా తక్కువమార్కుల వచ్చినవారు పీజీ చేస్తున్నారని పశు వులు మేపుతూ ఎం.ఏ. చవదవడం. బి.ఈడీ. చేస్తే టీచరు ఉద్యోగం వస్తుందని కొందరు చెబితే ప్రైవేటుగా చదివి ఉపాధ్యాయుడు కావడంతో ఆర్థిక సమస్యలు లేక పోయినా నాకంటూ ఏర్పాటు చేసుకొన్న బతుకుబాటలో నడవడానికి చాలా పోరాటం చేశాను....ఇప్పటికీ చేస్తూనే ఉన్నాను.


**ప్రశ్న.మీ "ఇసక" కథలు ఇప్పటికయితే అతికినట్లు సరిపోతాయి అనుకొంటాను. మీరేమంటారు?**

జవాబు.1992 ఆ ప్రాంతంలో పెన్నా నది గట్టులో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ అప్పటి ఇసుక దోపిడీని చూసి రాసిన "ఇసక" కథ రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి పొందింది. అప్పుడు చిట్టెలుక స్థాయిలో ఉన్న ఇసుక సమస్య ఇప్పుడు ఏనుగు స్థాయికి మించిన భయంకర స్థితిలో ఉంది. ఎంతరాసినా తక్కువే!!






















**ప్రశ్న.మీరు పల్లెకూ పట్టణానికీ మధ్య ఉన్నారు కదా? రెండు జీవితాల్నీ ఏ విధంగా బేరీజు వేయవచ్చు?**

జవాబు.నేను 1952 లో పుట్టినాను. 1958 నుంచీ కొంత అప్పటి జీవితాలు గుర్తున్నాయి. పల్లెలకు కరెంటు....ఇతర యాంత్రిక పరికరాలు అందుబాటుకు రాని కాలం. దాదాపు గ్రామాల్లోని కుటుంబాలు అన్నీ ఒకదాని మీద ఒకటి ఆధారపడుతూ స్వయం సంవృద్ధితో సాగేవి. అదే సమయంలో వ్యాపారుల, పెత్తందారుల దోపిడీలు ఉండేవి. పురాతన దారులు, భావాలతో ప్రజల్లో చైతన్యం చాలా తక్కువ. దోపిడీల్ని ఎదురించి బతుకుదామనే ఒరవడి, దబ్బుల చలామణి సమాజంలో చాలా తక్కువ. అప్పటి జీవన పద్ధతులకు (సాంప్రదాయానికి) వ్యతిరేకంగా బతికేవారిని సహించేవారు కాదు. దానికి దృష్టాంతంగా ఒక ఉదాహరణ. 1984 ఆ ప్రాంతంలో మా పల్లెలో ఒక వ్యక్తి 10 రూపాయల ధరతో(అనుకొంటా) ట్యాంకర్ తో నీళ్ల అమ్మడం మొదలు పెట్టాడు. గ్రామం పెద్దలంతా కలిసి అతన్ని పిలిచి నీళ్ల అమ్మకం చెడ్డపని అని మందలించి పట్టణవాసికి అమ్మేదాకా వదల్లేదు. మరి ఇప్పుడు...ప్రతి మారుమూల పల్లెలోనూ ట్యాంకర్ల ద్వారా (మినరల్ వాటర్ అనే పేరుతో) ప్రతి కుటుంబం కొనే తాగుతూ ఉంది. ఇప్పుడు అది ఒక పెద్ద నిత్యావసర పరిశ్రమకూడా!!

తమ కింది కులాలవారూ, అదే కులం అయినా తమకన్నా దిగువ స్థాయిలో ఉన్నవారూ కొత్తదారులు తొక్కితేనో, ఎదిగితేనో సహించేవారు కాదు. అందుకే పల్లెలు దినదినం తరిగిపోయి పట్నాలు విస్తృతమవుతూ ఉన్నాయి.

ఇక పట్టణాల గురించి. అక్కడ మానవ సంబంధాలు అన్నీ ఆర్థిక సంబంధాలే!! తమ బతుకు అవసరం మేరకు కాక అందినంతా దోచుకోవడమే జీవన పరమావధిగా మారిపోయింది. వస్తువులు సృష్టించి కాకుండా డబ్బుతో డబ్బును సంపాదించడమే అక్కడి రీతి.

**ప్రశ్న.మీ బతుకు అంతా వెతుకులాట అన్నారు కదా! ఇప్పుడు దేన్ని వెతుకుతూ ఉన్నారు?**

జవాబు. నేను వాస్తవ వాదిని. బతుకును ప్రేమిస్తాను. మారుతున్న శాస్త్ర సాంకేతిక ఆధునికతల్ని అవగాహన చేసుకొంటూ ఇప్పటి ఆలోచనలతో ఎప్పుడూ తాజాగానే బతకాలి అనుకొంటూ అలాగే బతుకుతున్నాను. అసలు వెతుకులాట ఉంటేనే భౌతిక బతుకు బండి ముందుకు సాగేది. లేకపోతే రహదారుల్లో నడపకుండా షెడ్డులో నిలబెట్టితే తుప్పుపట్టే వాహనం లాగా బతుకు ఆగిపోతుంది. అటు వంటి నాకు తెలిసిన ఎందరినో ఉదాహరణగా చెప్పగలను. ఇక్కడ అసందర్భం.

**ప్రశ్న."మహాభినిష్క్రమణం" రైతు కనుమరుగు... అన్నారు కదా!!ఇప్పుడు నీళ్లు సంవృద్ధిగా ఉన్నాయి. మరి మళ్లీ రైతును పొలాల్లో చూడవచ్చా?**

జవాబు. మాది వ్యవసాయ కుటుంబం.1960 నుంచి నాకు పల్లెల వ్యవసాయం తెలుసు. అప్పుడు అందరి జీవన ఆధారం వ్యవసాయమే! మానవుడు అన్నిరకాల కష్టాలను తగ్గించుకొంటూ సుఖాల వైపు పయనిస్తూ ఉంటాడు. దానికి ఆది కాలం నుంచి ఎన్ని ఉదాహరణలు అయినా చెప్పవచ్చు. దాని జతకు 1970 ఆ ప్రాంతం నుంచి పెన్నానది ప్రాంతంలో వర్షాభావ పరిస్థితి ఏర్పడడము....అంతో ఇంతో చదివినవారు పొట్ట చేతపట్టుకొని నగరాలకు వలస పోవడము, చదువు రానివారు రకరకాల పనుల్లో చేరి బతకడం అలవాటు చేసుకొన్నారు.

ఆ రకంగా ఇప్పుడు వారి శక్తు యుక్తులు అందుబాటును బట్టి రోజుకు 200 రూపాయల నుంచి 800 దాకా సంపాదిస్తున్నారు. ఒకటి రెండు తరాలు వ్యవసాయాన్నే పూర్తిగా మరిచిపోయాయి. ఇప్పుడు కావలసినంత నీరు ఉండీ వ్యవసాయం చేయడానికి ఎవరైనా రైతులు ముందుకు వచ్చినా కూలీలు దొరకడం లేదు. కారణం.... సంవత్సరం పొడుగునా రైతు పనిని ఇవ్వలేదు. అంతేకాక నీటి పట్టులో "గుంపులోగోవింద" గా పనులు చేయడం కుదరదు. ఎండ, వాన, దుమ్ము ధూళిలో రైతుతో పాటు పనులు చేయాలి. చేసినా ఇతర పనులలో ఇచ్చినంత కూలి రైతు ఇవ్వలేదు. రైతు పది రకాల పంటలు పండిస్తే కనీసం నాలుగు పంటలకు కూడా గిట్టుబాటు ధర చిక్కడం లేదు. కాబట్టి గతం లాంటి వ్యవసాయం అటువంటి పల్లెలూ ఇక కనిపించవు.

కేవలం ఒకరిద్దరు వ్యక్తులు యంత్రాల సాయంతో చేయగల వ్యవసాయం అయితేనే పల్లెలు మరలా పచ్చగా కనిపించగలవు.

**ప్రశ్న. మీరు ఆర్థికంగా ఇక్కట్లు పడి, ఇప్పుడు ఒక సురక్షిత స్థాయికి చేరుకొన్నారు కదా!! మరి డబ్బు ప్రాధాన్యత గురించి ఎందుకు రాయలేదు?**

జవాబు. నేను ఆర్థికంగా చాలా ఇక్కట్లు పడిన మాట వాస్తవమే!! ఎందుకంటే "డబ్బులు ఈరోజు వస్తాయి! రేపు పోతాయి మానవ సంబంధాలు విలువలు ముఖ్యం" అని గుడ్డిగా నమ్మడమే!! అయితే జీవిత అనుభవాలు వేరే రకం ఫలితాల్ని ఇచ్చాయి. "నాకు లేక పోయినా ఇతరులకు సాహాయ మార్గాలు చూపిద్దాం" అనే నా బలహీనతల వల్ల అనుకోని సంఘటనలతో కొంత ఆర్థిక స్థిరత్వం అబ్బింది.

ఇప్పుడు కొన్ని ఆర్థిక కార్యకలాపాలు సగిస్తూ ఉన్నాను. తొందరలో వాటిని ముగించి "ఆర్థిక సమాజం" గురించి కొన్ని పచ్చి నిజాల్ని రాయాలి అని అనుకొంటూ ఉన్నాను.

**ప్రశ్న. సాహిత్యానికి మీరేమి చేశారంటే ఏమని సమాధానం చెబుతారు**

జవాబు. "నేను ఎవరు? యెవరి పక్షాన గొంతు విప్పాలి" అని తెలుసుకొనే సమయానికి నలభై యేళ్లవయస్సు వచ్చింది. (అదికూడా కర్ణాటక తెలుగు లెక్చరరు డా.పెద్దిరెడ్డి స్నేహంతో) కారణం అనారోగ్యం, మారుమూల పల్లెల్లో ఒంటరిగా మిగిపోవడమే!! అయినా నావంతు కృషి కొంతవరకూ చేశాను అనిపిస్తుంది.

ముఖ్యంగా మన పురాణాలు, ప్రబంధాలు వగైరా సాహిత్యాన్ని చదివితే అప్పటి సామాన్య ప్రజలు, వారి జీవన విధానం, భాష తదితరాలు మనకు కనిపించవు. చక్రవర్తులు, రాజులు,పాలేగాళ్ల దగ్గర చేరి అభూత కల్పనలు, మానవాతీత శక్తులతో అప్పటి పండితుల భాషలో మహాపండితులు రాసిన కథనాలే దాదాపు అన్నీ. నాకు చిన్నప్పటి నుంచి(మా నాన్న చెప్పే భారతం కథలు వినికావచ్చు) అటువంటి పురాణాలు వాటిలోని పదజాలం నచ్చేదికాదు.

నా ఉద్దేశ్యంలో ఒక రచయిత తాను బతికిన కాలాన్ని, సమస్యల్ని అప్పటి ప్రజల నిత్య వ్యవహారిక భాషతో రికార్డు చేయడం!! దానిని చదివితే రాబోయే తరాలకు ఈ జీవన విధానం కళ్లకు కట్టినట్లు అనిపించాలి...అని!!

అందుకే "బతుకు వెతుకులాట" (కనిపిస్తారు మీరూ ఒక చోట) అనే రచన చేశాను. నేను లేక పోయినా నా ఆ రచన ఉంటుంది అని గాఢంగా నమ్ముతాను. నా నమ్మకాన్ని బలపరుస్తూ ప్రసిద్ధ కథకుడు, నవలా రచయిత కేంద్రసాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత బండి నారాయణ స్వామి "నేనే ప్యానల్ మెంబర్ని అయితే బతుకు వెతుకులాట పుస్తకానికి సాహిత్య అకాడమీ పురస్కారం ఇచ్చేవాడిని....ఇంటి భాషతో రాసిన మొదటి జీవిత చరిత్ర ఇది" అని ఆ మధ్య ఒక చోట అన్నాడు! ఆ కితాబు చాలదా!!

**ప్రశ్న. మీ నుండి నవల ఆశించవచ్చా?**

జవాబు. ఇది చాలా మంది సాహిత్య మిత్రులు అడిగే ప్రశ్న. నాకూ రాయాలని ఉంది. కానీ ఉద్యోగ విరమణా నంతరం కుటుంబ భారం అనివార్యంగా మోయవలసి రావడం, సబ్జెక్టు సిద్ధం చేసుకొని రాయడం మొదలు చేసే సమయానికి ఆరోగ్యం దెబ్బ తినడం, మరికొన్ని సమస్యలు మీదపడం తో ఇప్పటికి రెండు నవలలు కొంత మొదలు చేసి అసంపూర్తిగా ఆపివేయడం జరిగింది. జతకు నాకు ఓపిక తక్కువ. మొదలు పెట్టిన తరువాత ఏకధాటిగా రాయగలిగితేనే ముగించగలను. అవాంతరాల వల్ల మధ్యలో ఆపితే అప్పటి మూడ్ మాయం అయి మరలా రాయలేను. నవల రాయాలంటే కనీసం సంవత్సరమో ఆరునెలలో మన జీవితం నుండి వేరుపడి ఆ కాలంలోకి, పాత్రల లోనికి చేరిపోవాలి...చూడాలి ఆ స్థితికి నేను చేరుకొంటానో లేదో!?

# పేదరికం చదువుకు అడ్డుకారాదు

(మొదటిపేజీ తరువాయి)

నుంచి సబ్జెక్ట్ టీచర్లు అందుబాటులో ఉంచే దిశగా అడుగులు పడుతున్నాయి. క్లాస్‌లలో డిజిటల్ బోధన కోసం ఆరో తరగతి నుంచి ప్రతి పిల్లాడికీ ఐఎఫ్పీ ప్యానెల్స్ బిగించి డిజిటల్ బోధన చేయిస్తున్నాం. 8వ తరగతి పిల్లలకు కంటెంట్ లోడెడ్ ట్యాబ్‌లను ఇస్తూ ప్రోత్సహిస్తున్నాం. మన పేదింటి పిల్లలందరూ అంతర్జాతీయంగా ఎదగాలనే ఉద్దేశంతో ఈ సంవత్సరం నుంచి మూడో తరగతి నుంచి టోఫెల్ ఎగ్జామ్ కు ప్రిపేర్ చేస్తున్నాం. అంతర్జాతీయ సర్టిఫికెట్ ఇచ్చే గొప్ప అడుగు పడుతోంది.

పిల్లలు వినడం, మాట్లాడటం రెండింటిలో కూడా ఇంగ్లిష్‌లో ఇక అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడే పరిస్థితి తీసుకొచ్చే కార్యక్రమం మన గవర్నమెంట్ బడుల్లో జరుగుతోంది. ఇలాంటి మార్పులు గవర్నమెంట్ బడుల్లో రాగలుగుతాయా? ఇది సాధ్యమయ్యే పనేనా అనే పరిస్థితి నుంచి.. ఇవన్నీ మన గవర్నమెంట్ బడులే.. ప్రైవేట్ బడులకు గవర్నమెంట్ బడులతో పోటీ పడక తప్పదు అనే పరిస్థితి తీసుకొచ్చాం.ప్రతి ఒక్కరూ కనీసం డిగ్రీతో బయటకు రావాలి. ఈ క్రమంలో ఏ పిల్లాడు గానీ, తల్లిదండ్రులు గానీ అప్పులపాలయ్యే పరిస్థితి రాకూడదు. డిగ్రీ సర్టిఫికెట్ చేతిలో ఉండాలని అనే తాపత్రయంతో విద్యాదీవెన, వసతి దీవెన కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్, ఇటువంటివన్నింటికీ మొత్తం ఫీజులన్నీ ప్రభుత్వమే భరిస్తోంది. విదేశాల్లో కూడా టాప్ 50 కాలేజీల్లో 21 ఫ్యాకల్టీల్లో 350 కాలేజీల్లో ప్రతి పిల్లాడికీ సీటు తెచ్చుకోండి.. మీకు మీ జగన్ ప్రభుత్వం అండగా ఉంటుంది. కోటీ 25 లక్షలైనా కూడా మీరు భయపడాల్సిన పని లేదు. రాష్ట్రంలోనే కాదు, దేశంలో కూడా ఎక్కడా జరగని విధంగా బడులను ప్రోత్సహిస్తూ అమ్మ ఒడి అనే గొప్ప కార్యక్రమం తీసుకొచ్చాం.మన పిల్లలందరూ కూడా ప్రతి రంగంలోనూ ఎదగాలి. ఎదగడం కూడా కాదు.. ఎగరాలి. ప్రపంచంలో వస్తున్న ఇన్వెన్షన్స్, ఇన్నోవేషన్స్.. వీటిని అనుసరించేవారుగా మన వాళ్లు ఉండకూడదు. వీటిలో ప్రతి రంగంలోనూ ప్రపంచానికి లీడర్లుగా మన పిల్లలు ఉండాలనే తపన, తాపత్రయంతో అడుగులు వేస్తున్నాం. ఇది జరగాలంటే క్వాలిటీ ఆఫ్ ఎడ్యుకేషన్ రావాలి.

అందుకే ఈ నాలుగు సంవత్సరాల్లో మన ప్రభుత్వం పెట్టిన శ్రద్ధ దేశంలో ఎవరూ పెట్టి ఉండరు. రాబోయే రోజుల్లో మన గవర్నమెంట్ బడుల్లో ఐబీ సిలబస్ కూడా తీసుకొచ్చే కార్యక్రమం జరుగుతుంది. రాబోయే రోజుల్లో ఇంటర్నేషనల్ పరీక్షల మాదిరిగానే మన పరీక్ష పత్రాలు కూడా మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. గవర్నమెంట్ బడుల్లో చదువుకుంటున్న పేద వర్గాలు రేపొద్దున ప్రపంచాన్ని ఏలే పరిస్థితి కూడా త్వరలోనే వస్తుంది. మనం చూస్తాం. లీడర్ షిప్ క్వాలిటీస్ పెంచే విధంగా మన చదువులు ఉన్నాయి. టెన్త్, ఇంటర్, ఇంజనీరింగ్, మెడిసిన్ లేదా ఏదో ఒక డిగ్రీ తెచ్చుకోవడమే కాకుండా చదువులు వేగంగా మారుతున్నాయి. ప్రపంచాన్ని శాసించబోయే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్సెస్, మెషీన్ లెర్నింగ్, ఛాట్ జీపీటీ యుగంలో ఉన్న పిల్లలందరూ కూడా ఎంతగా ఎదగాలి అన్నది ఆలోచించాలి. ఆ స్థాయిలో ఎడ్యుకేషన్ రంగం మారబోతోంది. మార్పు చేస్తాం. ఈ మార్పును ప్రతి పేద వాడికి తీసుకురావాలి. టాప్ ర్యాంకులు తెచ్చుకున్నమీరే కాదు.. మీతోపాటు ఏ ర్యాంకూ తెచ్చుకోలేని వాళ్లు కూడా ఈక్వలీ ఇంపార్టెంట్. సంకల్పం గట్టిదైతే రిజల్ట్ ఆటోమేటిగ్గా వస్తుందని గుర్తు పెట్టుకోవాలి. మాణిక్యాలన్నీ మట్టిలోనే దొరుకుతాయి. అరక దున్నినప్పుడు వజ్రాలు బయటికి వస్తాయని జ్ఞాపకంలో ఉంచుకోవాలి. గవర్నమెంట్ బడుల్లో కార్పొరేట్ కాలేజీలకు మించి సదుపాయాలు అందిస్తామని తెలియజేస్తున్నా. గవర్నమెంట్ బడికి జీవం పోస్తూ ఆణిముత్యాలను సత్కరించే కార్యక్రమం ప్రారంభిస్తున్నాం. “ చెప్పుకొచ్చారు.

జగనన్న ఆణిముత్యాల పేరుతో చేసే సత్కారాలు వారం రోజుల పాటు కొనసాగాయి. పదో తరగతిలో టాప్ మార్కులు వచ్చిన వారికి లక్ష, రెండో స్థానంలో ఉన్న వారికి రూ.75 వేలు, మూడో స్థానంలో ఉన్న వారికి రూ. 50 వేలు ప్రభుత్వం ఇస్తోంది. పాఠశాల స్థాయిలో కూడా 20,299 మందికి నగదు పురస్కారం ఇచ్చారు. టాపర్‌లకు రూ.3,000, రెండో స్థానంలో ఉంటే రూ.2,000, మూడో స్థానంలో ఉంటే రూ.1,000 ఇచ్చారు. నియోజకవర్గ స్థాయిలో కూడా 681 మంది టాపర్లకు నగదు బహుమతులు ఇచ్చారు. టాప్ ర్యాంకర్లకు రూ.15,000, రెండో స్థానంలో ఉన్న వారికి రూ.10,000, మూడో స్థానంలో ఉన్న వారికి రూ.5,000 అందించారు. జిల్లా స్థాయిలో 609 మందిని ఎంపిక చేసి వారి మూడ కేటగిరీలుగా విభజిస్తారు. జిల్లా టాపర్లకు రూ.50,000, రెండో స్థానంలో ఉంటే రూ.30,000, మూడో స్థానంలో రూ.15,000 ఇస్తారు. ఇంటర్‌లో 26 మంది టాపర్స్‌కు రూ. లక్ష రూపాయలు అందించారు. జిల్లా స్థాయిలో 391 మంది టాపర్లకు రూ.50,000 చొప్పున అందజేశారు. నియోజకవర్గ స్థాయిలో 662 మందికి రూ.15,000 చొప్పున ఇచ్చారు. మొత్తం 22,710 మంది టెన్త్, ఇంటర్ విద్యార్థులకు ఈ ప్రోత్సాహకాలు అందజేశారు. ప్రతి ఒక్క విద్యార్థికి నగదుతోపాటు సర్టిఫికేట్, మెడల్ ఇచ్చారు. ఇంటర్మీడియట్ ప్రతి గ్రూపులోను రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన మొత్తం 22,710 మంది విద్యార్థులకు ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాలుగా ప్రోత్సాహం అందించనుంది.అట్టడుగు వర్గాల వారు ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదగాలి. ప్రపంచాన్ని మారుస్తున్న టెక్నాలజీ గురించి విద్యార్థులు తెలుసుకోలి. ప్రపంచాన్ని శాసించబోయే ఏఐ, ఇతర లాంగ్వేజీలపై విద్యార్థులు దృష్టి పెట్టాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు అడుగులు వేయాలి. నాయకత్వ లక్షణాలు పెంపొందే విధంగా విధ్యనభ్యసించాలి. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్య నభ్యసించి రాష్ట్రస్థాయిలో టాప్ ర్యాంకులు సాధించిన వారితో మిగతావరు స్ఫూర్తి పొందాలన్న సీఎం జగన్.పేదరికం వల్ల ఎవరూ చదువులకు దూరం కాకూడదనేది ప్రభుత్వం నిర్ణయం. మూడో తరగతి నుంచి సబ్జెక్ట్ టీచర్లు తీసుకొచ్చాం. డిజిటల్ బోధనతో ఎఫెక్టివ్ గా చదువు నేర్పిస్తున్నాం. ఈ ఏడాది నుంచి మూడో తరగతి నుంచి టోఫెల్ కు ప్రిపేర్ చేస్తున్నాం. ప్రైవేట్ స్కూల్స్ ప్రభుత్వ పాఠశాలలతో పోటీ పడే పరిస్థితి కి తీసుకొచ్చాం. తల్లిదండ్రులు అప్పులు పాలు కాకుండా డిగ్రీ వరకూ విద్య అందిస్తున్నాం. డిగ్రీ,మెడిసిన్ ఫీజులు ప్రభుత్వమే భరిస్తూ విద్యా దీవెన,వసతి దీవెన తీసుకొచ్చాం. విదేశాల్లో కూడా టాప్ యూనివర్సిటీల్లో ఫీజులు భరిస్తున్నమని సీఎం జగన్ తెలిపారు.

# అమెరికాతో సంబంధాలు ఇప్పుడు మరింత బలం

(మొదటిపేజీ తరువాయి)

చైనాతో ద్వైపాక్షిక సంబంధాలకు సరిహద్దులో శాంతి, ప్రశాంతత అవసరమని ప్రధాని అన్నారు. వివాదాన్ని శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు. తాము ఎల్లప్పుడూ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతను గౌరవిస్తాము, చట్ట నియమాలకు కట్టుబడి ఉంటాము. శాంతియుత మార్గాల ద్వారా వివాదాలు, విభేదాలను పరిష్కరించుకుంటామన్నారు. భారతదేశం తన సార్వభౌమత్వాన్ని, గౌరవాన్ని పరిరక్షించడానికి పూర్తిగా సిద్ధంగా ఉంది.. ఈ విషయాలకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు.అంతర్జాతీయ వివాదాలు.. యుద్ధం, ఘర్షణల గురించి ప్రధాని మోడీ మాట్లాడుతూ.. “అన్ని దేశాలు అంతర్జాతీయ చట్టాన్ని, ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవించాలి. ఏ రకమైన వివాదమైనా యుద్ధం ద్వారా గెలిచే బదులు “దౌత్యం ? సంభాషణ” ద్వారా పరిష్కరించేలా ఉండాలి.” అంటూ సూచించారు. న్యూఢిల్లీ ? వాషింగ్టన్ మధ్య నెలకొన్న సంబంధాల గురించి ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ప్రపంచ తిరుగుబాట్ల మధ్య భారతదేశం అంతర్జాతీయ స్థాయిలో తన సముచిత స్థానాన్ని పొందేందుకు ప్రయత్నిస్తున్నందున ఇరు దేశాల మధ్య సంబంధాలు గతంలో కంటే బలంగా, లోతుగా ఉన్నాయని తెలిపారు. భారత్, అమెరికా నేతల మధ్య ‘అద్భుతమైన విశ్వాసం’ నెలకొందని ఆయన అన్నారు.రెండు దేశాల మధ్య పెరుగుతున్న రక్షణ సహకారం మన భాగస్వామ్యానికి ఒక ముఖ్యమైన మూలస్తంభమని ప్రధాని మోదీ అమెరికన్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. ఇది కేవలం దీనికే పరిమితం కాకుండా వాణిజ్యం, సాంకేతికత, ఇంధన రంగానికి విస్తరించిందని తెలిపారు.కాగా.. ప్రధాని నరేంద్ర మోడీ ఇవ్వాల్టి నుంచి మూడు రోజుల పాటు అమెరికాలో పర్యటించనున్నారు. ఈరోజు రాత్రి న్యూయార్క్‌లో దిగనున్నారు. అమెరికాకు చేరుకునే ముందు అమెరికా వార్తాపత్రిక వాల్ స్ట్రీట్ జర్నల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు

# ప్రజా పార్టీ” పేరుతో గద్దర్ కొత్త పార్టీ

(మొదటిపేజీ తరువాయి)

నుంచి పోటీ చేస్తారని ప్రచారం జరిగింది కూడా. స్వరాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితి, నిరుద్యోగ సమస్య, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల తీరు, ధరణి పోర్టల్ వల్ల ప్రజలు పడుతున్న బాధలను.. ‘నన్ను గన్న తల్లుల్లారా’ అనే బాణీలో వివరిస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను బట్టబయలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే గద్దర్.. సీఎం కేసీఆర్‌పై పోటీ చేస్తారనే ప్రచారం కూడా జరిగింది. ఆయన కాంగ్రెస్ చేరి ఆ పార్టీ నుంచే పోటీ చేస్తారని అందరూ అనుకున్నారు. పోరు బాటకు పొద్దు పొడుపు. నిద్రాణమైన తెలంగాణకు మేలుకొలుపు. బానిసలారా లెండిరా అంటూ బహుజనులను జాగృతం చేసినా.. అమ్మా తెలంగాణమా అని ప్రజల గోసను గానం చేసినా.. పొడుస్తున్న పొద్దుతో పోటీ పడి ఉద్యమాన్ని రగిలించినా.. అది గద్దర్‌కే సొంతం. గద్దర్ పాట విని ఎగిరి దుంకని పల్లె లేదంటే అతిశయోక్తి కాదు. పాటతోనే ప్రస్థానాన్ని ప్రారంభించి.. పాటతోనే ప్రజా ప్రస్థానాన్ని ముగిస్తానని చెప్పిన గద్దర్ అని పిలువబడే విఠల్ రావు ఇప్పుడు కొత్త పార్టీకి అంకురార్పణ చేస్తున్నారు. ఇప్పటికే పార్టీకి సంబంధించిన విధివిధాలను ఆయన రూపొందుకున్నట్లు తెలుస్తోంది. ఎందుకంటే పార్టీ పేరు, జెండాను ఆయన రూపొందించారు కూడా.

# రూ.2000 నోట్ల ఉపసంహరణ తో భారీగా తగ్గిన డిజిటల్ పేమెంట్లు

(మొదటిపేజీ తరువాయి)

ఎస్‌బీఐ రిపోర్ట్ లెక్కగట్టింది. బంగారు, నగలు, ఏసీ, మొబైల్ ఫోన్లు, రియల్ ఎస్టేట్ వంటి అధిక వ్యాల్యూ ఉన్న వస్తువుల కొనుగోళ్లు పెరుగుతాయని తెలిపింది.ఉదాహరణకు నగదు లావాదేవీలు గణనీయంగా పెరిగాయి. పెద్ద ఎత్తున రూ.2 వేల నోట్లు చెలామణిలోకి వచ్చాయి. ఆలిండియా పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ (ఎఐపిడిఎ) విడుదల చేసిన రిపోర్ట్ ఇందుకు అద్దం పడుతోంది. రూ.2 నోట్ల ఉపసంహరణకు ముందు అమ్మకాల్లో 40 శాతంగా ఉన్న డిజిటల్ పేమెంట్లు భారీగా తగ్గాయని వివరించింది.

**క్యాష్ ఆన్ డెలివరీల్లో పెరుగుదల..**

పెద్ద నోటు ఉపసంహరణ తర్వాత క్యాష్ ఆన్ డెలివరీలు కూడా పెరిగాయి. క్యాష్ ఆన్ డెలివరీపై ఆర్డర్లు చేసే వారి సంఖ్య పెరిగిందని ఎస్బీఐ రిపోర్ట్ పేర్కొంది. జొమాటో యూజర్లలో 75 శాతం క్యాష్ ఆన్ డెలివరీ ఆప్షన్ ఎంచుకుంటుండగా.. వారిలో రూ.2 వేల నోట్లు చెల్లిస్తున్నవారు కూడా ఉన్నారు. ఇక గృహోపకరణాల విక్రయాలు కూడా పెరిగాయని ఎస్‌బీఐ రిపోర్ట్ ప్రస్తావించింది. రూ.2 వేల నోటు ఉపసంహరణ కారణంగా దేశంలో నగదుపై పెద్దగా ప్రభావం చూపబోదని చెప్పింది. ఇక రుణాల పరంగా చూస్తే.. డిపాజిట్లలో 30 శాతం అంటే దాదాపు రూ.92,000 కోట్లు రుణాలకు పోయే అవకాశం ఉందని వివరించింది. ముమ్ముందు కూడా రుణ జారీ పెరిగే అవకాశముందని విశ్లేషించింది. మొత్తంగా జీడీపీ వృద్ధి రేటుకు ఇది సానుకూలమవుతుందని తెలిపింది.

# రేపటి నుంచి నైరుతి రుతుపవనాలు

(మొదటిపేజీ తరువాయి)

ఉంది. రాగల మూడు రోజులు తెలంగాణ రాష్ట్రంలో ఉరుములు మరియు మెరుపులతో కూడిన వర్షములు అక్కడక్కడ వచ్చే అవకాశం ఉంది.ఈ రోజు రాష్ట్రంలో ఆదిలాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలలోని కొన్ని ప్రాంతాలలో అక్కడక్కడ వడగాల్పులు వీచే అవకాశం ఉంది. తెలంగాణలోని ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, పెద్దపల్లి జిల్లాల్లో అక్కడక్కడ వేడిగాలుల పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నెల 21 నుంచి 25 మధ్య నైరుతి తెలంగాణను తాకే అవకాశాలు ఉన్నాయని వాతావరణ అధికారులు అంచనా వేశారు.“ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. సాయంత్రం లేదా రాత్రి సమయంలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉంది. గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు వరుసగా 39 డిగ్రీలు, 29 డిగ్రీలుగా ఉండే అవకాశం ఉంది. ఉపరితల గాలులు పశ్చిమ దిశ నుంచి గాలి వేగం గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో వీచే అవకాశం ఉంది” అని వెదర్ బులెటిన్ లో పేర్కొ?న్నారు. నిన్న గరిష్ఠ ఉష్ణోగ్రత 39.2 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 28.6 డిగ్రీలుగా నమోదైంది. గాలిలో తేమ 53 శాతంగా నమోదైంది.ఏపీలో రాయలసీమ ప్రాంతాలు ముఖ్యంగా రత్నగిరి, కొప్పాల్, పుట్టపర్తి, శ్రీహరికోట ప్రాంతాల్లో నైరుతి రుతుపవనాలు విస్తరించాయని, వాటి గమనం చురుగ్గా సాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. రుతుపవనాలు చురుగ్గా కదలడానికి అనుకూలమైన పరిస్థితులే ఉన్నాయని వివరించారు. రాగల రెండు మూడు రోజుల్లో ద్వీపకల్ప దక్షిణ భారతంలోని మరికొన్ని ప్రాంతాలకూ విస్తరించే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. నెల్లూరు నగరంలోని పలు భాగాల వైపుగా కొన్ని వర్షాలు విస్తరిస్తున్నాయి. దీని వలన నెల్లూరులో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలను చూడగలం. మరో వైపున పల్నాడు జిల్లా పిడుగురాళ్ల – రెంటచింతల వ్యవధిలో వర్షాలు విస్తరిస్తున్నాయి. ఇది మెల్లగా పల్నాడు జిల్లాలోని పశ్చిమ భాగాలు, ప్రకాశం జిల్లాలోని పలు పశ్చిమ భాగాల్లోకి విస్తరించనున్నాయి.


# రేపు అతిపెద్ద పగటి రోజు

(మొదటిపేజీ తరువాయి)

చిన్నగా ఉండి.. దీర్ఘకాలం భూ భ్రమణంలో వేగం తగ్గుతుందని, ఈ పరిణామ క్రమంలో కొన్నిసార్లు పగటి సమయం ఎక్కువగా ఉంటుందని శాస్త్రజ్ఞులు తేల్చారు. ఈనెల 21వ తేదీ తెల్లవారుజామున 5.34 గంటలకు సూర్యోదయం మొదలవుతుంది. సాయంత్రం 6.41 గంటలకు సూర్యాస్తమయం జరుగుతుంది.ఏటా జూన్ 20 లేదా 21వ తేదీన లేదా డిసెంబర్‌లో ఇలాంటి పరిణామాలు సంభవిస్తాయని పరిశీలనలో తేలింది. దక్షణాది అర్ధగోళంలో ఉండే యూకే, యూఎస్, రష్యా, కెనడా, భారత్, చైనాలో వేసవి కాలం ముగిస్తే.. అదే సమయంలో ఆస్ట్రేలియా, అర్జెంటీనా, చిలీ, న్యూజిలాండ్‌లో శీతాకాలం ప్రారంభమవుతుండటం ఖగోళ పరిణామ క్రమంలో మరో విశేషం.??ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం గుడివాడలోఈ నెల 21వ తేదీ, అలాగే మనదేశంలోని మధ్యప్రదేశ్‌లో ఉన్న ఉజ్జయినిలో తొలి సూర్యోదయం జరుగుతుంది.ఆంధ్ర రాష్ట్రంలో తొలి సూర్యోదయం కృష్ణాజిల్లాలోని గుడివాడలో సంభవిస్తుందని శాస్త్రవేత్తలు తేల్చారు. ఇంకా కొన్ని ప్రాంతాల్లో సెకన్ల తేడాతో సూర్యాస్తమయం జరుగుతుంది. ఇలాంటి పరిణామం 1975లో వచ్చిందని, తిరిగి మళ్లీ 2203వ సంవత్సరంలో వచ్చే అవకాశం ఉంటుందని శాస్త్రవేత్తలు తేల్చారు.

# శృంగారానికి నిరాకరించడం నేరం కాదు

**బెంగళూరు :**



భార్యతో శృంగారానికి భర్త నిరాకరించడం నేరం కాదని కర్ణాటక హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. హిందూ వివాహ చట్టం ప్రకారం శృంగారానికి నిరాకరించడం క్రూరత్వమే కానీ.. ఐపీసీ సెక్షన్ 438ఏ ప్రకారం నేరం కాదని స్పష్టం చేసింది. భర్త, అత్తమామాలపై సదరు మహిళ పెట్టిన క్రిమినల్ కేసును కొట్టేసింది.కర్ణాటకలో ఒక మహిళకు డిసెంబర్ 18, 2019లో వివాహం జరిగింది. అయితే ఆమె భర్త ఆధ్యాత్మిక మార్గం అనుసరిస్తూ భార్యతో శారీరక బంధాన్ని కొనసాగించేందుకు నిరాకరించాడు. దీంతో సదరు మహిళ 28 రోజుల తర్వాత అత్తగారింటి నుంచి పుట్టింటికి వచ్చేసింది. 2020 ఫిబ్రవరిలో ఐపీసీ సెక్షన్ 498ఏ కింద వరకట్న నిరోధక చట్టం కింద భర్త, అత్తామామలపై కేసు పెట్టింది. దీంతో పాటు హిందూ వివాహ చట్టం ప్రకారం తన వివాహ బంధం పరిపూర్ణం కాలేదని ఫ్యామిలీ కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. 2022లో వీరి వివాహాన్ని ఫ్యామిలీ కోర్టు రద్దు చేసింది. అయితే భర్త, అత్తామామలపై పెట్టిన క్రిమినల్ కేసుల మాత్రం అలాగే కొనసాగించింది. అయితే దీన్ని ఛాలెంజ్ చేస్తూ భర్త, కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు.ఈ కేసుపై విచారణ జరిపిన హైకోర్టు.. ఈ కేసులో భర్తపై ఉన్న ఆరోపణ ఒక్కటే. ఆధ్యాత్మిక మార్గంలో ఉన్న ఆయన, ప్రేమ అంటే కేవలం మనసుకు సంబంధించిన మాత్రమే కానీ, శృంగారానికి సంబంధించింది కాదని పేర్కొంది. హిందూ వివాహ చట్టం ప్రకారం శృంగారానికి నిరాకరించడం క్రూరత్వమే కానీ నేరం కాదని తెలిపింది. దీంతో భర్తపై ఉన్న క్రిమినల్ చర్యలు తీసుకుంటే అది వేధింపుల కిందకే వస్తుంది. అందువల్ల ఈ కేసులో అతనిపై క్రిమినల్ కేసులు కొట్టేస్తున్నామని కోర్టు తీర్పు ఇచ్చింది.

# కార్పొరేటర్ కు ఎమ్మెల్యే వేధింపులు

**హైదరాబాద్:**

బీఆర్ఎస్‌లో ఎమ్మెల్యేలను వరుస వివాదాలు చుట్టుముడుతున్నాయి. తనను వేధిస్తున్నారని మాజీ మంత్రి రాజయ్యపై ఓ మహిళ ఆరోపణలు చేశారు. ఆ తర్వాత దుర్గం చిన్నయ్యపై శైజల్ అనే మహిళ తీవ్ర ఆరోపణలు చేసింది. ఇప్పుడు ఈ కేసులో జాతీయ మానవహక్కుల కమిషన్ విచారిస్తోంది. జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డిపై సొంత కుమార్తె భూకబ్జా ఆరోపణలు చేశారు. ఇప్పుడు మరో సీనియర్ నేతపై హైదరాబాద్ కార్పొరేటర్ వేధిస్తున్నారని అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారన్న వార్త సంచలనంగా మారింది. అధికార పార్టీ బీఆర్ఎస్‌కు చెందిన ఓ సీనియర్ నేతపై అదే పార్టీకి చెందిన కార్పొరేటర్ ఫిర్యాదు చేశారట. అర్థరాత్రి ఫోన్ చేసిన సదరు నేత యోగక్షేమాలు అడిగారని.... అలా మాట్లాడుతూనే వాయిస్‌లో మార్పు వచ్చిందని సమాచారం. అప్పటి వరకు ఆదర్శ నాయకుడు అనుకున్న వ్యక్తి అలా మాట్లాడేసరికి మహిళా కార్పొరేటర్ కంగుతిన్నారట. ఏం చేయాలో అర్థం కాలేదామెకు అని చెబుతున్నారు. టెన్షన్‌లో కూడా ఆ లీడర్ వాయిస్‌ను రికార్డు చేశారని చెప్పుకుంటున్నారు. ఆయన చెప్పినవన్నీ విన్న కార్పొరేటర్... అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారని టాక్. తాను రికార్డు చేసిన ఆడియోను అధినాయకత్వానికి అందించినట్టు తెలుస్తోంది. రాజకీయాల్లో భాగంగా తిరిగినంత మాత్రాన తప్పుగా అర్థం చేసుకుంటే ఎలా అంటూ వాపోయారట. ఓ మంత్రి వద్ద విషయాన్ని ప్రస్తావించినట్టు సమాచారం అందుతోంది. ఫిర్యాదు అందుకున్న అధిష్ఠానం ఆయనపై నిఘా పెట్టింది. అన్ని వర్గాల నుంచి సమాచారాన్ని సేకరిస్తోంది. ఆయనపై గతంలో ఇలాంటి ఆరోపణలు ఏమైనా ఉన్నాయా... అన్న కోణంలో సీక్రెట్‌గా విచారణ చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఇలాంటి విషయంలోనే వరంగల్‌కు చెందిన లీడర్లు బద్నాం అవుతున్నారు. రాజయ్య లాంటి వారు ఇలాంటి ఆరోపణలతోనే మంత్రి పదవి కూడా పోగొట్టుకున్నారు. ఎన్నికలు దగ్గరపడుతున్న టైంలో ఏ చిన్న అవకాశం దొరికినా ప్రతిపక్షాలకు ఛాన్స్ ఇచ్చినట్టే అవుతుందని అధికార పార్టీ టెన్షన్. అందుకే హైదరాబాద్ పార్టీ నేతల విషయాన్ని బయటకు వెళ్లకుండా సీక్రెట్‌గా ఎంక్వయిరీ చేస్తున్నట్టు చెబుతున్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి....

**ఒంగోలు**



ప్రకాశం జిల్లా బెస్తవారిపేట మండలం పెంచికలపాడు గ్రామ సమీపంలోని అమరావతి అనంతపురం జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో దొంత గుండలు వయసు 56 సంవత్సరాలు పూర్తిగా గాయాలు తగిలి సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు.జరిగిన రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నమని బేస్తవారిపేట ఎస్సై మాధవరావు తెలిపారు.

## ఎమ్మెల్యే జీవన్ రెడ్డి పర్యటన

**జగిత్యాల**



జగిత్యాల రూరల్ మండలం చల్ గల్ గ్రామంలో ఈ నెల 16న ప్రమాదవశాత్తూ అగ్నికి ఆహుతి అయిన ఈత వనంలో గీతా కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు మంగళవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి బావి, పైపు లైన్ల ఏర్పాటు కోసం రు.5 లక్షల సీడీపీ నిధులతో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా గీత కార్మికులు జీవన్ రెడ్డి కి అభిమానంతో కల్లు పోసి తమ ఆప్యాయతను చాటుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలతో నష్ట పోయిన గీత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. అగ్ని ప్రమాదంలో చెట్లు కాలిపోయి, ఉపాధి కోల్పోయిన గీతా కార్మికులకు పరిహారం అందించి, గీత కార్మిక వృత్తికి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.

## ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో విద్యార్థి బలి

**హనుమకొండ**

తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో విద్యార్థి బలి అయ్యాడు. కమలాపూర్ మండలం మరిపెల్లి గూడెంలో ఈ విషాదం జరిగింది. విద్య పండుగా ర్యాలీ తీస్తుండగా ట్రాక్టర్ కింద పడి 6వ తరగతి విద్యార్థి ఇనుగాల ధనుష్(10)మృతి చెందాడు. ర్యాలీ తీస్తుండగా కిరాణం దుకాణం లోకి వెళ్లి బిస్కెట్ ప్యాకెట్ తెచ్చుకుంటుండగా వెంట పడ్డ కుక్కలు తప్పించుకునే ప్రయత్నంలో విద్యార్థి ట్రాక్టర్ కింద పడ్డాడు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో 5 వ తరగతి పూర్తి చేసి ఈ విద్యా సంవత్సరం 6 వ తరగతిలో ప్రవేశం కోసం హైస్కూల్ కు ధనుష్ వెళ్లాడు. విద్యా పండుగ వేడుకల్లో భాగంగా ర్యాలీ తీస్తుండగా ఘటన జరిగింది. కొడుకు మృతి వార్త విని తల్లిదండ్రులు జయపాల్, స్వప్న కన్నీరు మున్నీరుగా విలపించారర. పాఠశాల నిర్వహకుల నిర్లక్ష్యమే విద్యార్థుల ప్రాణం తీసిందని గ్రామస్తులు అంటున్నారు. పాఠశాల నిర్వాహకులు, అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## హుక్కా సెంటర్ పై పోలీసుల దాడి

**రంగారెడ్డి**




రంగారెడ్డి జిల్లా మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని అర్ధరాత్రి ఎలాంటి అనుమతులు లేకుండా హుక్కా సెంటర్ ను నడిపిస్తున్న యువకులతో పాటు హుక్కా సేవిస్తున్న 20 మంది యువకులను పక్కా సమాచారం మేరకు ఎస్ఓటి పోలీసుల దాడులు నిర్వహించారు యువకులందరినీ మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ కి తరలించారు హుక్కా సెంటర్ ని సీజ్ చేసి కేసు ఎస్వోటీ పోలీసులుహుక్కా పాట్లతో సహా సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కి అప్పగించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు.

## ఎంపి బాపురావు మంచి వ్యక్తి..నేనేమీ అనలేదు

**ఆదిలాబాద్**

ఎంపీ సోయం బాపురావ్ ఆరోపణలపై మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ మంగళవారం స్పందించారు. ఎంపీ సోయం బాపురావ్ నాపై చేసిన వ్యాఖ్యలు సరైనవి కావు. ఆయనపై నాకు ప్రగాఢమైన విశ్వసం ఉందని అయన అన్నారు. ఆయన నాయకత్వంలోనే నేను బీజేపీలో చేరాను.

ఎంపీ టికెట్ ఆశించను.. ఖానాపూర్ కే పరిమితం అవుతా అని నేను గతంలోనే స్పష్టం చేశా. నాదృష్టి మొత్తం ఖానాపూర్ పైనే.. ఆదిశగా నేను పని చేసుకుంటున్న. ఎంపీ లాడ్స్ గురించి నేను అడగలేదు, ఎక్కడ మాట్లాడలేదని అన్నారు. తమపై ఆరోపణలు వస్తే పిలిపించుకొని అడిగే హక్కు సోయం బాపురావ్ కి ఉంది. పక్కనున్న వాళ్ళు ఏదో కల్పించి చెప్తే నమ్మడం సరైంది కాదు. సోయం బాపురావ్ చాలా మంచి వ్యక్తి, అమాయకుడు, వివాదాల్లో తలదూర్చడు. పార్టీలో ఉన్న లోపాలను సరిచేస్తూ సోయం ముందుకెళ్లాలి. పేద ప్రజలకు ఎంపీగా సోయం బాపురావ్ చాలా చేస్తున్నారు. నేను ఖానాపూర్ కే అంకితం. మేము ఇద్దరం కలిస్తే.. ఎంపీ పరిధిలోని 7 అసెంబ్లీ స్థానాలు గెలువొచ్చని అన్నారు.

# ఎమ్మెల్యేల్లో సమీక్ష టెన్షన్

**గుంటూరు:**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జూన్ 21న 'గడప గడపకూ మన ప్రభుత్వం' ప్రజా సంప్రదింపు కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ ఎమ్మెల్యేల పనితీరును సమీక్షించనున్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ టిక్కెట్లు కోరుతున్న ఎమ్మెల్యేలకు ఈ సమీక్ష అగ్నిపరీక్షలా మారనుంది. ప్రతి మూడు నెలలకోసారి వైఎస్సార్‌సీపీ శాసనసభ్యుల పనితీరుపై సీఎం ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఫలితంగా, దాదాపు 30-40 మంది ఎమ్మెల్యేలు పేలవమైన పనితీరు కనబరిచిన వారిగా గుర్తించబడ్డారు. వారి పనితీరుకు సంబంధించిన పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుంది. వచ్చే ఎన్నికల్లో గెలుపు గుర్రాలకే టిక్కెట్లు ఇస్తామని సీఎం జగన్ ఇప్పటికే స్పష్టం చేశారు. మంచి పనితీరు యొక్క ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు, వైయస్ఆర్ కాంగ్రెస్ టిక్కెట్‌పై పోటీ చేసే ప్రతి ఒక్కరూ విజయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే, జూన్ 23న ప్రారంభం కానున్న జగనన్న సురక్ష జనబాట కార్యక్రమానికి సంబంధించి పార్టీ సభ్యులకు ముఖ్యమంత్రి సూచనలు చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సాధారణ ఎన్నికల షెడ్యూల్‌ను అనుసరిస్తామని సీఎం జగన్ చెప్పడం ద్వారా ముందస్తు ఎన్నికల ఊహాగానాలకు తెరపడటం గమనార్హం. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ పనితీరును మెరుగుపరుచుకునేందుకు రానున్న 10 నెలల సమయాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. తెలుగుదేశంలోకి విధేయులుగా మారిన నలుగురు సస్పెన్షన్ ఎమ్మెల్యేల స్థానంలో నలుగురు నేతలను నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లుగా జగన్ రెడ్డి నియమించారు. మార్చి నెలాఖరులో జరిగిన పార్టీ వర్క్‌షాప్‌లో, పనితీరులో మెరుగైన పనితీరు కనబరిచిన ఎమ్మెల్యేల పేర్లను, అలాగే పేలవమైన పనితీరును కనబరిచిన వారి పేర్లను సీఎం జగన్ వెల్లడించారు. 30-40 మంది ఉన్న పేలవమైన ప్రదర్శనకారులకు జూన్ 21న జరగనున్న తదుపరి సమావేశానికి ముందు కష్టపడి పనిచేసి మెరుగుపరచుకోవాలని నిర్దేశించారు. 175 నియోజకవర్గాలపై సమగ్ర సర్వే నివేదికలు, క్షేత్రస్థాయి పరిస్థితులపై విలువైన అవగాహన కల్పిస్తూ సీఎంకు ఇటీవలే నివేదికలు అందాయి. గత ఏడాది మే 11న గడప గడపకూ మన ప్రభుత్వం ప్రజా సంప్రదింపు కార్యక్రమాన్ని ప్రారంభించినప్పటి నుంచి ప్రతి నెలా కనీసం 16 నుంచి 21 రోజులపాటు ప్రజలతో మమేకం కావాలని మంత్రులు, ఎమ్మెల్యేలను సీఎం జగన్ కోరారు. ప్రజాప్రతినిధులను ప్రజలకు చేరువ కావడంతోపాటు వారి సమస్యలను పరిష్కరించడం ఈ కార్యక్రమం లక్ష్యం. దాదాపు 80% మంది శాసనసభ్యులు తమ పనితీరులో మెరుగుదల కనబరిచినప్పటికీ, మిగిలిన 20% మందిలో గుర్తించదగిన మార్పు లేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మార్పు కనిపించని వారి విషయంలో సీఎం జగన్ కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నారు

# రాయలసీమ కోసం న్యాయ పోరాటం

**తిరుపతి :**

రాయలసీమకు జరుగుతున్న అన్యాయంపై జులై నెలలో ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాయలసీమ స్టీరింగ్ కమిటీ అధ్యక్షులు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ప్రకటించారు. ఆదివారం కడపలో నిర్వహించిన రాయలసీమ స్టీరింగ్ కమిటీ విస్తృత సమావేశానికి బైరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశంలో రాయలసీమ లోని నాలుగు ఉమ్మడి జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ అనాధిగా వివక్షకు గురవుతూనే ఉందన్నారు. అప్పటి పాలకుల నుంచి ఇప్పటి పాలకుల వరకూ ఏ ఒక్కరూ రాయలసీమను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. రాయలసీమలో జరుగుతున్న అన్యాయంపై ఢిల్లీలోనే పోరు నిర్వహించేందుకు జులై నెలలో ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.ప్రత్యేక రాయలసీమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ రాయలసీమ వ్యాప్తంగా 3.5 లక్షల మంది సంతకాల సేకరణ చేపట్టామన్నారు. మలి విడత సంతకాల సేకరణ సోమవారం నుంచి ప్రారంభిస్తున్నామన్నారు. రాయలసీమ ఇప్పటికే ఎన్నో ఎదురు దెబ్బలు తినిందన్నారు. ప్రత్యేక రాయలసీమ కోసం అనువుగా ఉన్న అన్ని అవకాశాలనూ సద్వినియోగం చేసుకుంటామన్నారు. 1951లో కృష్ణా -పెన్నార్ ప్రాజెక్టు నిర్మాణం జరిగి ఉంటే రాయలసీమలో కరువు ఉండేది కాదన్నారు. 1956లో కర్నూలు రాజధానిని పోగొట్టుకుని రాయలసీమ మరోసారి దెబ్బతిందన్నారు. రాయలసీమ నడిగడ్డ హోస్పేటను వదులుకున్నామన్నారు. రాయలసీమకు దెబ్బమీద దెబ్బలు పడుతూనే ఉన్నాయన్నారు. సిద్దేశ్వరం వద్ద బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. తద్వారా 60 టి.ఎం.సిల నీరు నిల్వ చేస్తే రాయలసీమ ప్రాంతానికి సాగు, తాగునీరు అంది సస్యశ్యామలం అవుతుందన్నారు. ప్రభుత్వం మాత్రం తీగెల వంతన కడుతామని చెపుతోందని, దాని వల్ల రాయలసీమ దరిద్రం పోతుందా అని బైరెడ్డి ప్రశ్నించారు.అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణం వల్ల మూడు రాష్ట్రాల్లోని 8 జిల్లాలు పూర్తిగా నష్టపోతాయని బైరెడ్డి తెలిపారు.. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి అప్పర్ భద్రను ఆపితే పులివెందులకు కూడా నీళ్లివ్వొచ్చన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కర్నాటకలో అక్రమ ప్రాజెక్టులు నిర్మిస్తున్నారన్నారు. దీని వల్ల నష్టపోయేది ముందుగా రాయలసీమ ప్రాంతమేనని ఆయన పేర్కొన్నారు. హోస్పేట్ డ్యాంలోనీ నీరు స్మగ్లింగ్ జరుగుతోందన్నారు. 69 జీ.ఓను రద్దు చేయాలని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. రాయలసీమలో అన్నమయ్య ప్రాజెక్టు, అలగనూరు రిజర్వాయర్, పోతిరెడ్డి పాడు హెడ్ రెగ్యులేటర్ గేట్లు పాడై ఏళ్లు గడుస్తున్నా చర్యలు శూన్యమని బైరెడ్డి మండిపడ్డారు. ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డికి నాలుగేళ్లు ఢిల్లీకి వెళ్లేందుకే సమయం సరిపోతోందన్నారు. ఇంత దద్దమ్మ ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదన్నారు. రాయలసీమ నాశనం చేసింది, చేస్తోంది సినీమావాళ్లేనన్నారు. రాయలసీమపై లేని పోనివి చూపించి రక్తపాతమంటూ ప్రచారాలు ఊదరగొట్టి రాయలసీమకు పెట్టుబడులు రాకుండా చేస్తోంది వాళ్లేనని చెప్పారు. ఖనిజాలకు ఆలవాలం, వర్షానికే వజ్రాలను అందించే గొప్ప పుణ్యనేల రాయలసీమ అని బైరెడ్డి పేర్కొన్నారు

# వీసీపై వేటు... అధికారం ఎవరికి

**నిజామాబాద్ :**

త్యం వివాదాలతో వార్తల్లో నిలుస్తుంది నిజామాబాద్ లోని తెలంగాణ విశ్వవిద్యాలయం. గత కొన్ని రోజులుగా ఉపకులపతికి వ్యతిరేకంగా బోధనా సిబ్బంది, బోధనేతర ఉద్యోగులు, విద్యార్థులు ఆందోళన చేస్తూ వస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో తెలంగాణ విశ్వవిద్యాలయ ఉపకులపతి వీసీ రవీందర్ గుప్తా లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కడంతో వ్యవహారం కీలక మలుపు తిరిగింది. అవినీతి ఆరోపణలు ఎదుర్కోవడంతో పాటు ఏకంగా లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖకు చిక్కడంతో ఆయనను వీసీ పదవి నుంచి తొలగించే వ్యవహారంపై చర్చ జరుగుతోంది. వీసీని తొలగించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుందా.. లేదా గవర్నర్ కు ఉంటుందా అనేది విద్యాశాఖ వర్గాలు చర్చిస్తున్నాయి. విశ్వవిద్యాల యాలకు ఉపకులపతులను నియమించే అధికారం, తొలగించే అధికారం పూర్తిగా గవర్నర్ కు మాత్రమే ఉంటుంది. నియామకానికి సిఫార్సు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నా.. తొలగించే అధికారం మాత్రం గవర్నర్ కే ఉంటుందని నిబంధనలు పేర్కొంటున్నాయి. ఇదే విషయాన్ని స్వయంగా వీసీ రవీందర్ గుప్తా కూడా పలు సందర్భాల్లో తెలంగాణ వర్సిటీ పాలక మండలి సమావేశాల్లో ప్రస్తావించినట్లు సమాచారం. కాలేజీ విద్యా కమిషనర్ కు తనను ప్రశ్నించే అధికారమే లేదని ఆయన అన్నట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. తనను వీసీగా తొలగించే అధికారం ప్రభుత్వానికి లేదంటూ ఆయన గట్టిగా మాట్లాడిన తీరు అప్పట్లో వార్తల్లో నిలిచింది. ఇదే క్రమంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కోవడం, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు చేయడం, తాజాగా లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడటంతో వీసీ తొలగింపు హాట్ టాపిక్ గా మారింది .ఏదైనా విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్ ను నియమించడానికి ముందు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ఇస్తుంది. ఈ ప్రక్రియ కోసం ముగ్గురు సభ్యులతో ఓ కమిటీని ఏర్పాటు చేస్తుంది. ఇందులో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నుంచి ఒకరు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి విద్యాశాఖ కార్యదర్శి, వీసీ నియామకం జరిగే వర్సిటీ నుంచి పదవీ విరమణ చేసిన నిపుణుడైన మాజీ వీసీ(సాధారణంగా) మొత్తం ముగ్గురు కమిటీలో ఉంటారు. నోటిఫికేషన్ తర్వాత వచ్చే దరఖాస్తులను కమిటీ పరిశీలించి.. అందులో అర్హతలు ఉన్న ముగ్గురి పేర్లను గవర్నర్ కు పంపుతుంది. ఇందులో నుంచి గవర్నర్ ఒకరిని ఎంపిక చేస్తారు. ఆ తర్వాత గవర్నర్ నియామకానికి సంబంధించిన నియామకపు ఉత్తర్వులు రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శి ఇస్తారు. గవర్నర్ నియమించిన వీసీ సరైన వ్యక్తి కాదనుకున్నా, అవినీతి ఆరోపణలు ఎదురైనా లేదా రాష్ట్ర ప్రభుత్వానికి ఇష్టం లేకున్నా.. రెండింట మూడొంతుల అసెంబ్లీ మెజారిటీ తీసుకుని వీసీ తొలగింపు ఉత్తర్వులు ఇస్తారు. ఆ తర్వాత అసెంబ్లీ నిర్ణయాన్ని గవర్నర్ కు పంపుతారు. అలాగే గవర్నర్ కు కూడా వీసీ ని కారణాలు లేకుండా తొలగించే అధికారం ఉండదు. అయితే తెలంగాణ వర్సిటీ వీసీ లాంటి సంక్లిష్టమైన వివాదం గతంలో ఎప్పుడూ ఎదురవ్వలేదు. ఏసీబీ దాడి చేసి వీసీని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకోవడం పైనా పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇలా ఏసీబీ దాడి చేయడానికి ముందుగా గవర్నర్ అనుమతి తీసుకోవాల్సిన అవసరం ఉందా అనే విషయంపై ఉన్నతాధికారులు న్యాయ నిపుణుల సలహా తీసుకున్నారు. అయితే వీసీ వేతనం తీసుకుంటున్నారు కాబట్టి, ప్రజా సేవకుడిగానే చూడాలని నిపుణులు తెలిపారు. కాబట్టి ఏసీబీ చట్టం పరిధిలోకి వస్తారని అంటున్నారు. వీసీని సస్పెండ్ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. విచారణలో వీసీ నేరం రుజువైతే ఆయనను శాశ్వతంగా తొలగించే అధికారం కూడా రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుందని చెబుతున్నారు. అయితే ప్రతీ విషయాన్ని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం మాత్రం ఉంటుందని అంటున్నారు.

## మున్సిపాలిటీ కౌన్సిలర్ గిత్తల దేవరాజ్ కు ఘనంగా సత్కారం



**జోగులాంబ గద్వాల**

ఉత్తమ అవార్డు అందుకున్న ఐజ మున్సిపాలిటీ కౌన్సిలర్ గిత్తల దేవరాజ్ ను జోగులాంబ జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు తట్టే మహేష్ ఘనంగా సత్కరించారు. ఇట్టి కార్యక్రమంలో రాష్ట్ర ఓబిసి కార్యదర్శి మాస్టర్ షేక్షావలి ఆచారి, జోగులాంబ జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లాప్రధాన కార్యదర్శి ఎన్. సాంబశివుడు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాండురంగ, తూముకుంట కేకే బసవరాజ్, సుందర్ రాజ్, బాలకృష్ణ పాల్గొన్నారు

## గంజాయి కి వ్యతిరేకంగా అవగాహన



**విశాఖపట్నం**

విశాఖలో గంజాయి, కిడ్నా ఫర్లు, దౌర్జన్యాలు, దాడులు, కబ్జాదారులు నుండి రక్షణ కల్పించాలని కోరు తూ సేవ్ విశాఖ పేరుతో కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు తెలుగు మహిళ తెలుగు యువత ఆధ్వర్యంలో గంజాయి అక్రమ రవాణాపై విద్యార్థు లుకు అవగాహన కల్పించారు. గాజు వాక ప్రైవేట్ కళాశాలలో విద్యార్థులతో అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విశాఖ తెలుగుయువత అధ్యక్షులు తాతాజీ మాట్లాడుతూ ప్రభుత్వం వృధా ఖర్చులు మానుకొని గంజాయి మత్తు పదార్థాలపై అవగాహన కార్య క్రమాలు చేయాలని, అక్రమార్కులు పై చర్యలు తీసుకోవాలని అన్నారు.

## చెల్లెలు ఫ్రెండ్ ను బెదిరించి రేప్

**మెదక్**

దేశంలో ఎక్కడో ఓ చోట ప్రతిరోజూ అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయి. చిన్నారుల నుంచి ముసలివాళ్ల వరకు కూడా ఈ దారుణాలు జరుగుతున్నాయి. ఈ కేసులో ప్రభుత్వం ఎన్ని శిక్షలు విధించిన ఈ విషయంలో మార్పులు రావడం లేదు. తాజాగా మెదక్ జిల్లా శివంపేట మండలంలోని ఓ యవకుడు ఓ బాలికను పలుమార్లు అత్యాచారం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే రమేష్(22) అనే యువకుడికి చెల్లె ఉంది. అయితే ఓసారి వాళ్ల ఇంటికి రమేష్ చెల్లె స్నేహితురాలు(14) వచ్చింది.ఆ సమయంలో రమేష్ కూడా ఇంట్లోనే ఉన్నాడు. అయితే తన సొదరి స్నేహితురాలని బెదిరించి అత్యాచారం చేశాడు. అలాగే పలుమార్లు ఆ బాలికపై రమేష్ అత్యాచారం చేశాడు. అయితే ఇటీవల ఆ బాలిక ప్రవర్తనలో మార్పులు వచ్చాయి. ఆమె తల్లిదండ్రులు ఆస్పత్రికి వెళ్లి చూపించారు. ఆ బాలిక ఐదు నెలల గర్భవతిగా వైద్యులు తేల్చారు. దీంతో ఆమె తల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు రమేష్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి ప్రస్తుతం విచారణ జరుపుతున్నారు.

## తెలంగాణ సర్కార్ నయా ప్లాన్..

### ఆ 'గుడ్లు' ఇక మాయం కావు..!

**హైదరాబాద్**

అవినీతి, అక్రమాలకు చెక్ పెట్టేందుకు తెలంగాణ సర్కార్ నిత్యం వినూత్నమైన కార్యక్రమాలు చేపడుతోంది. అంగన్వాడీ కేంద్రాలకు చేరాల్సిన గుడ్లు దారిమళ్లుతున్నాయంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గుడ్లు పక్కదారి పట్టకుండా ఉండేందుక.. రంగుల ముద్రలు వేయాలని నిర్ణయించింది సర్కార్. జోన్ నెంబర్ సహా నీలం, ఎరుపు, ఆకుపచ్చ రంగులను గుడ్లకు వేసేలా ఏర్పాట్లు చేసింది.అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందజేయాల్సిన కోడి గుడ్లు పక్కదారి పడుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేసే కోడిగుడ్ల రవాణా, వాటిని లబ్ధిదారులకు పారదర్శకంగా అందించేందుకు వినూత్న చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ప్రతీ గుడ్డుపై ప్రత్యేక ముద్ర వేసి అందించనున్నారు.ఎలాంటి అవకవతకలు జరగకుండా విడతల వారీగా ఒక్కో రంగుతో ముద్రను వేసి సరఫరా చేస్తున్నారు. నెలలో పది రోజులకోసారి కోడిగుడ్లపై ప్రత్యేక రంగుతో కూడిన ముద్రను వేయనున్నారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా ఐదు జోన్ల పరిధిలో కాంట్రాక్టర్లకు బాధ్యతలు అప్పగించారు. కోడిగుడ్డు కుళ్లిపోతే కాంట్రాక్టరే బాధ్యత వహించాల్సి ఉంటుందని ప్రభుత్వం స్పష్ట చేసింది.

# పలకరించని తొలకరి... సాగెలా...

**కడప :**

తొలకరి పలకరింపు కోసం రైతాంగం ఎదురుచూస్తోంది. నాలుగేళ్లుగా జూన్‌లోనే వాతావరణం చల్లబడి వర్షాలు కురిశాయి. జూలై మొదటి వారంలో ఖరీఫ్ సాగు మొదలు పెట్టేవారు. అయితే ఈ సారి ఇప్పటికీ ఎండల తీవ్రత తగ్గలేదు. తొలకరి జాడ కనిపించడం లేదు. నైరుతి రుతుపవనాలు ఆలస్యమయ్యాయి. రాష్ట్రంలో ప్రవేశించిన తర్వాత కూడా వాతావరణంలో మార్పు కనిపించడం లేదు. దీంతో రైతుల్లో ఒకింత ఆందోళన వ్యక్తమవుతోంది. వ్యవసాయ శాఖ మాత్రం వర్షాలు వస్తాయన్న నమ్మకంతో ఈ ఏడాది ఖరీఫ్ ప్రణాళిక సిద్ధం చేసింది.వ్యవసాయ శాఖ ఈ సారి ఖరీఫ్ సీజన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టింది. రైతులకు సకాలంలో సహకారం అందించాలని ముందస్తు చర్యలు చేపడుతోంది. కలెక్టర్ ఇప్పటికే వ్యవసాయ అధికారులకు ఖరీఫ్‌పై సూచనలు చేశారు. వ్యవసాయ అధికారులు కూడా ఈ ఏడాది ఖరీఫ్ కలిసి వస్తుందన్న నమ్మకంతో ఉన్నారు. నైరుతి రుతు పవనాలు ప్రవేశించడంతో సాగు ప్రణాళిక రూపొందించారు. జిల్లాలోని ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో ఖరీఫ్ సాగుకు అవసరమైన మేర నీరు ఉన్నప్పటికీ జిల్లా అంతటా ఈ వనరులు లేవు. వర్షాలు కురిస్తేనే ఖరీఫ్ సాగుకు ఊపు వస్తుంది. లేదంటే ప్రాజెక్టులు, బోర్ల క్రింద మాత్రమే సాగవుతుంది .ప్రభుత్వం ఈ నెల 1వ తేదీ నుండి ప్రారంభమైన ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతుల పంటల సాగుకు అవసరమైన ఎరువులతో పాటు వేరుశనగ, పచ్చిరొట్ట విత్తనాలను ముందస్తుగా కేటాయించింది. జిల్లాలో 77,105 హెక్టార్ల సాగు లక్ష్యంతో ప్రణాళిక రూపొందించారు. 8,366 క్వింటాళ్ల వివిధ రకాల విత్తనాలను సబ్సిడీపై సరఫరా చేయడం ప్రారంభించారు. వీటితో పాటు వివిధ రకాల ఎరువులు 59,342,89 మెట్రిక్ టన్నులు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. వీటన్నింటిని రైతులకు అవసరాన్ని బట్టి పంపిణీ చేస్తారు.ఈ ఏడాది పూర్తి లక్ష్యంతో సాగయ్యే అవకాశాలు ఉన్నాయని వ్యవసాయ, ఉద్యానవన అధికారులు పేర్కొంటున్నారు. అత్యధికంగా 33,215 హెక్టార్లలో వరి పంట, 21,566 హెక్టార్లలో పత్తి, 5,739 హెక్టార్లలో వేరుశనగ, 3,453 హెక్టార్లలో శనగ, 3,044 హెక్టార్లలో పసుపు, 1,817 హెక్టార్లలో మినుము, 1,332 హెక్టార్లలో జొన్న, 1,170 హెక్టార్లలో పొద్దు తిరుగుడు తదితర పంటలుసాగు ప్రణాళికలు రూపొందించారు. జిల్లా రైతాంగం కూడా తొలకరి వర్షాలు కురిసి ఒకటి రెండు పదనుల వాన పడితే ఖరీఫ్ సాగుకు సన్నద్ధ మయ్యేందుకు ఎదురు చూస్తున్నారు.

# రాష్ట్రానికి కాపు కాస్తున్న కేంద్రం

**విజయవాడ :**

జగన్ రెడ్డి ప్రభుత్వం విషయంలో కేంద్రంలోని మోడీ సర్కార్ అనుసరిస్తున్న వైఖరి. ఆంధ్రప్రదేశ్ ప్రజల విషయంలో కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ సర్కార్ తీరు మాటల్లో పలకరింపు, నొసటితో వెక్కిరింపు అన్న చందంగా ఉంది. గత నాలుగేళ్లుగా జగన్ రెడ్డి ప్రభుత్వ విధానాలను అన్ని విధాలుగా సమర్ధిస్తూ వచ్చిన మోడీ సర్కార్.. ఇక ఎన్నికల సంవత్సరం వచ్చే సరికి ఎక్కడ లేని హడావుడీ ప్రదర్శించి ఒకే సారి రాష్ట్రానికి రెవెన్యూ లోటును విడుదల చేసి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆర్థిక ఇబ్బందుల్లోంచి బయటపడేసేందుకు చేయగలిగినంతా చేసింది. అదీ సరిపోదనుకుందో ఏమో అప్పులకూ అడ్డగోలు అనుమతులు ఇచ్చేసింది. అందించగలిగినంత సహకారం అందించేసి... ఇక ఇప్పుడు ఏపీ సర్కార్ పై విమర్శల పర్వానికి తెరతీసింది. కేంద్ర మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాలు ఏపీ పర్యటనలో జగన్ సర్కార్ ను అవినీతి మయంగా అభివర్ణించారు. దోపిడీ, అవినీతి జగన్ నాలుగేళ్ల పాలన సారాంశంగా తేల్చేశారు. వారి తరువాత ఇక బీజేపీ ఏపీ నేతలు తమ నోటికి పని చేబుతున్నారు. అయితే మాటలు కోటలు దాటుతుంటే.. చేతలు మాత్రం ఇంకా జగన్ రెడ్డి సర్కార్ కు సహకారం అందిస్తూనే ఉన్నాయి. ఎందుకు ఇలా జరుగుతోంది అంటే కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ జగన్ ను మోడీ ఎంత అభిమానంతో చూసుకుంటారో గతంలో చెప్పిన మాటలను ఒక సారి గుర్తు చేసుకోవాలి. జగన్ పట్ల మోడీకి ఉన్నది పుత్ర వాత్సల్యం అని నిర్మలా సీతారామన్ గతంలో ఒక సారి చెప్పారు.అందుకే అడ్డగోలు అప్పులు చేసి రాష్ట్రాన్ని గుల్ల చేసేస్తున్నా సహకారం అందిస్తూనే వస్తున్నారు. జగన్ సర్కార్ ను అవినీతి మయంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించేసిన తరువాత కూడా ఈ సహకారం ఆగలేదు. తాజాగా రుణ పరిమితిలో విధించిన కోతకు ప్రత్యేక వెసులుబాటు కల్పించింది. ఎన్నికల ఏడాదిలో జగన్ రెడ్డి ప్రభుత్వం ఆర్థికంగా ఎటువంటి ఇబ్బందులూ ఎదుర్కోకుండా ఉండేందుకు కేంద్రంలోని మోడీ సర్కార్ చేయగలిగినంతా, చేయాల్సినంతా చేస్తోంది. ఈ ఏడాది ఇప్పటికే కేంద్రం జగన్ రెడ్డి ప్రభుత్వానికి రూ. 28,704.02 కోట్ల మేర ప్రయోజనాలను అందించింది. మరింతగా రుణం పొందేందుకు అవకాశం కల్పించక పోయినా.. గతంలో విధించిన కోతను వాయిదాల పద్ధతిన తీర్చేందుకు వెసులు బాటు కల్పించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రుణపరిమితిపై 8,000 కోట్ల రూపాయల కోత విధించాల్సి ఉంటే మోడీ పుత్ర వాత్సల్యంతో జగన్ రెడ్డి ప్రభుత్వానికి ఈ కోతను వాయిదా పద్ధతిలో విధించాలని నిర్ణయించారు. అంటే ఎన్నికల సంవత్సరంలో జగన్ నెత్తిన రుణభారం పడకుండా వెసులుబాటు ఇచ్చారు. ఇక ఎన్నికల తరువాత వచ్చే ప్రభుత్వం ఈ భారం భరించాల్సి ఉంటుందన్న మాట. ఒక వేళ ప్రభుత్వ వ్యతిరేకత కారణంగా జగన్ రెడ్డి ప్రభుత్వం రెండో సారి అధికారంలోకి రాకపోతే.. జగన్ రెడ్డి తప్పిదాలకు మూల్యం వచ్చే ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుందన్న మాట. తప్పులు ఈ ప్రభుత్వం చేస్తే.. తదుపరి ప్రభుత్వం ఆ భారం భరించాల్సి ఉంటుందన్న మాట

# మరో 3 రోజులు వడగాల్పులే

**హైదరాబాద్ :**



తెలంగాణలో రాగల మూడు రోజుల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ప్రజలు పగటిపూట బయటకు రావొద్దని సూచించింది. తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. రాష్ట్రంలో మరో మూడు రోజులపాటు వగగాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ ప్రకటించింది. తెలంగాణలోని పలు జిల్లాలకు వాతావరణశాఖ ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, వరంగల్, మహబూబాబాద్, హన్మకొండ జిల్లాల్లో రాగల మూడు రోజులపాటు తీవ్ర వడగాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ అధికారులు హెచ్చరించారు. రాగల మూడు రోజులపాటు అత్యవసరమైతే తప్ప పగటిపూట ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రావొద్దని అధికారులు హెచ్చరించారు.. రాగల మూడు రోజులు ఎండలు తీవ్ర స్థాయిలో ఉంటాయని హెచ్చరించారు. నేడు, రేపు ఆదిలాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాలలో కొన్ని ప్రాంతాలలో వడగాలులు వీచే అవకాశం ఉందని అంచనా వేశారు అధికారులు. ఎల్లుండి రాష్ట్రంలో ఆదిలాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, భద్రాద్రి, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాలలో అక్కడక్కడ వడగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. నైరుతి రుతుపవనాలు మరో రెండు, మూడు రోజులలో దక్షిణ భారతదేశంలోని మరికొన్ని భాగాలకు విస్తరించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం దిగువ స్థాయిలోని గాలులు వాయవ్య, పశ్చిమ దిశల నుంచి తెలంగాణ వైపునకు వీస్తున్నాయని వెల్లడించారు.ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు విస్తరించేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని అంచనా వేసింది. ఈ నెల 21 నుంచి తిరుపతి, సత్యసాయి, అన్నమయ్య, తిరుపతి, వైఎస్సార్, చిత్తూరు జిల్లాలో చాలా చోట్ల తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురుస్తాయని... అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. కోస్తాంధ్రలో కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని పేర్కొంది. ఇక అటు తెలంగాణ లో కూడా కూడా ఈ నెల 21 నుంచి వర్షాలు ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటన చేసింది. నెల్లూరు తీరానికి దగ్గరలో ఉపరితల ఆవర్తనం ఏర్పడినట్లు ఏపీ వెదర్ మెన్ పేర్కొంది. నెల్లూరు, తిరుపతి జిల్లాల్లోని తీర ప్రాంతల్లో మరికొద్ది గంటల్లో చినుకులు, తేలికపాటి వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ప్రస్తుతానికి తూర్పు రాయలసీమ జిల్లాలు, దక్షిణ కోస్తాంధ్రలో ఆకాశం పూర్తి స్థాయిలో మేఘావృతం అయ్యి ఉంది. కానీ రాత్రి సమయం వెళ్లేసరికి, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఇవాళ వర్షాలు జోరందుకుంటాయని వివరించింది. తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న ప్రదేశాల్లో అధిక వర్షపాతం నమోదవ్వనుంది.

# ఇంటింటికి బీజేపీ....

## ఒకే రోజు 35 లక్షల కుటుంబాలను కలవాలని ప్లాన్

**హైదరాబాద్ :**

కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు పూర్తయ్యాయి. తొమ్మిదేళ్ల పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా ' ఇంటింటికీ బీజేపీ' కార్యక్రమాన్ని చేపట్టింది బీజేపీ. ఇందులో భాగంగా తెలంగాణ బీజేపీ నేతలు జూన్ 22న రాష్ట్రంలో ఒకే రోజు 35 లక్షల కుటుంబాలను కలవాలని ప్లాన్ చేశారు. పోలింగ్ బూత్ అధ్యక్షుడి నుంచి రాష్ట్ర అధ్యక్షుడి వరకు నేతలంతా ఓటర్ల ఇళ్లకు వెళ్లనున్నారు. ఒక్కో బూత్ ప్రెసిడెంట్ కనీసం 100 కుటుంబాలను కలుస్తారు ఆ పార్టీ నాయకులు తెలిపారు. రాష్ట్ర స్థాయి నాయకులు ఆయా నియోజకవర్గాల్లోని కుటుంబాలను కలిసి మోదీ పాలన, ఏం చేశారు.. ఏం చేయనున్నారు అనే అంశాలపై వెల్లడించనున్నారు. జూన్ 22 ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నేతలు కుటుంబాలను కలుస్తారు. తెలంగాణ వ్యాప్తంగా 35 లక్షల బూత్ కమిటీలు ఉన్నాయని.. వాటి కేంద్రంగా ' ఇంటింటికీ బీజేపీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వ్యూహం రచించించారు బీజేపీ నాయకులు. ప్రధాని మోదీ నేతృత్వంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించనున్నారు.కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని చైతన్య పురిలోని కుటుంబాలను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కలవనున్నారు. అదేవిధంగా కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డితోపాటు ఇతర సీనియర్ నేతలు కూడా తమ నియోజకవర్గంలోని ప్రజలను కలిసి ప్రధాని మోదీ ఈ తొమ్మిదేళ్లలో ఏం చేశారో చెప్పనున్నారు. మహాజనసంపర్క్ యాత్రలో భాగంగా బీజేపీ నేతలు జూన్ 22 నుంచి 30 వరకు ప్రజలను కలుస్తున్నారు.నెహ్రూ, ఇందిర తర్వాత.. తొలి దఫా కన్నా రెండోదఫాలో ఎక్కువ సీట్లు సాధించిన నేతగా నరేంద్రమోదీ రికార్డు సృష్టించారు. రాజీవ్‌గాంధీ తర్వాత సింగిల్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నాయకుడాయన. దేశాన్ని అన్ని విధాలుగా ముందుకు తీసుకువెళ్లాలంటే.. ఒక విజన్ ఉండాలి. ముందు అన్ని వర్గాలను ఒక్కతాటిపైకి తీసుకురావాలి. వాస్తవానికి అత్యంత సంక్లిష్టమైన ఈ దేశాన్ని ఒక్కతాటిపై ముందుకు తీసుకెళ్లడం మామూలు విషయం కాదు. గొప్ప సంకల్పబలం ఉన్న నాయకులకైనా అంతకు మించిన సమస్యలు ఎదురవు తాయి. ప్రస్తుతం నరేంద్రమోదీ అదే దశలో ఉన్నారు. అసలే ప్రపంచ ఆర్థికమాంద్యం, ఇంతలో కరోనా వైరస్ కలగలసి- దేశాన్ని సుడిగుండంలోకి నెడుతున్న పరిస్థితి. ఈ నైరాశ్యాన్ని తరిమికొట్టడానికి నరేంద్రమోదీ-హెర్క్యులస్‌లా ముందు నిలబడ్డారు. ఇంతటి ప్రతికూల పరిస్థితుల్లోనూ-భారత్‌ను గ్లోబల్ లీడర్‌గా చేయాలన్న ఆశలను, ఆశయాలను వదిలపెట్టని విక్రమార్కుడిలా ముందుకు వెళ్తున్నారు మోదీ.

# టీపీసీసీలో ఇన్‌చార్జ్ మార్పుపై ఉంటుందా?

**హైదరాబాద్ :**

కర్ణాటకలో తిరుగులేని విజయాన్ని నమోదు చేసి కాంగ్రెస్ అధిష్టానం.. తర్వాత తెలంగాణపై గురిపెట్టింది. తెలంగాణలో జరగబోయే ఎన్నికలకు సమాయత్తమవుతుంది. ఇదే క్రమంలో తెలంగాణ కాంగ్రెస్ బాధ్యతలను మరో కీలక నేతకు అప్పగించాలని పార్టీ అధిష్టానం నిర్ణయించినట్లుగా ఇటీవల వార్తలు జోరందుకున్నాయి. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీకి విక్టరీని అందించడంలో ట్రబుల్ షూటర్, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌కు.. తెలంగాణ కాంగ్రెస్ బాధ్యతలను కూడా అప్పగించాలని నిర్ణయించిందని గత కొన్నిరోజులుగా ఇటు మీడియాలో.. అటు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వార్తలు వస్తున్నాయి. అంతేకాదు.. టీకాంగ్రెస్ నేతల్లో నెలకొన్న సమన్వయాన్ని చక్కదిద్దేందుకు డీకే ఇప్పటికే రంగంలోకి దిగేశారని.. పార్టీలో చేరికల నుంచి అన్నీ ఇక ఆయన కనుసన్నల్లోనే జరుగుతాయని పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. దీనిపై తెలంగాణ కీలక నేతలు గానీ.. ఢిల్లీ అగ్రనేతలుగానీ క్లారిటీ ఇవ్వకపోవడంతో పార్టీ వర్గాల్లో అయోమయం నెలకొంది.డీకే విషయం పీక్స్‌కు చేరడంతో.. ఇన్‌చార్జ్ మార్పుంటూ వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని ఏఐసీసీ సెక్రెటరీ మాణిక్‌రావు ఠాక్రే తేల్చి చెప్పేశారు. నల్గొండ జిల్లాలో జరుతున్న సీఎల్పీ లీడర్ భట్టి పాదయాత్రలో డీకే విషయంపై ఠాక్రే ఫుల్ క్లారిటీ ఇచ్చేశారు. డీకే తెలంగాణకు రావట్లేదన్నారు. డీకే ఎన్నికల ప్రచారానికి వచ్చే విషయంలో ఏఐసీసీ పెద్దలదే తుది నిర్ణయమన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు జాతీయ నేతలు వచ్చి పని చేస్తారనీ ఠాక్రే చెప్పారు.అయితే సోనియాగాంధీ, రాహుల్‌గాంధీతో డీకే శివకుమార్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. మరోవైపు టిపిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి సైతం డీకేతో మంచి ర్యాపో మెంటెయిన్ చేస్తున్నారు. రాష్ట్రంలో పార్టీ విషయం నుంచి నేతల చేరిక వరకు ప్రతి విషయం డీకేతో రేవంత్ చర్చించాక అధిష్టానానికి నివేదిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. మరోవైపు కాంగ్రెస్ పార్టీ కూడా కర్ణాటక, తెలంగాణ నుంచి ఎక్కువ ఎంపీ స్థానాలు గెలుపొందాలనేది టార్గెట్‌గా పెట్టుకున్నట్లు తెలుస్తుంది. ఇలాంటి టైంలో డీకేను రెండు రాష్ట్రాలకు ఇన్‌చార్జ్‌గా కొనసాగిస్తే? అటు రాజకీయంగా ఇటు ఆర్థిక అంశాల్లోనూ తిరుగుండదని భావిస్తుంది కాంగ్రెస్. అయితే రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జిగా డీకే శివకుమార్ వస్తే.. టీకాంగ్రెస్‌కు ప్లస్ అవుతుందని భావించిన నేతలు ఠాక్రే ప్రకటనతో ఒకింత ఢీలా పడ్డారు. ఎన్నికలకు ఇంకా చాలానే టైమ్ ఉంది గనుక.. ఈలోపు ఏమైనా జరగొచ్చుననే భావన ఉన్నట్లు తెలుస్తుంది.

# జై తెలుగు పార్టీ' పేరుతో ఏపీలో కొత్త పార్టీ ఆవిర్భావం

## తెలుగు భాషా పరిరక్షణ అజెండాతో వచ్చే ఎన్నికలలో పోటీ- జొన్నవిత్తుల

**విజయవాడ :**



ఏపీలో చడీ చప్పుడు లేకుండా ఓ కొత్త పార్టీ ఆవిర్భవించింది. ఎలాంటి హంగామా లేదు. కనీసం ఒక చిన్న ప్రకటన కూడా లేకుండా కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవించింది. పార్టీ పేరు ఇంచుమించు తెలుగుదేశం పార్టీ మాదిరిగానే ఉంది. తెలుగు వాడి ఆత్మగౌరవం పేరుతో నాడు ఎన్టీఆర్ టీడీపీని ప్రారంభిస్తే.. ఇప్పుడు తెలుగు భాషా పరిరక్షణ కోసం అంటూ జై తెలుగు పార్టీని కవి, సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు ప్రారంభించారు. తెలుగు భాషా సంస్కృతి కోసం ప్రత్యేక రాజకీయ వేదికను ఏర్పాటు చేస్తున్నానని జొన్నవిత్తుల పేర్కొన్నారు. రాజకీయ నాయకులకు, ప్రజలకు సరైన అవగాహన కల్పించడమే తన లక్ష్యమని తెలిపారు. వారిని చైతన్య వంతులుగా చేయడానికే ఈ రాజకీయ వేదికను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏపీ బాగా నష్టపోయిందని జొన్నవిత్తుల అన్నారు. భాషా, సంస్కృతి పూర్తిగా వీధిన పడిపోయిందన్నారు. ఈ విలువల కోసం రాజకీయ నాయకులు, ప్రజలు పనిచేయాలన్నారు. జై తెలుగు పేరుతో ఐదు రంగులతో పతాకాన్ని కూడా రూపొందించానని జొన్నవిత్తుల తెలిపారు. నీలం రంగు జలం, పచ్చ రంగు వ్యవసాయం, ఎరుపు రంగు శ్రమశక్తి, పసుపు వైభవానికి చిహ్నం, తెలుపు జల వనరులు స్వచ్ఛంగా ఉండాలన్నారు. వెనుక తెలుగు భాష రథాన్ని ప్రజలు లాగాలనేది తన ఆకాంక్షగా జొన్నవిత్తుల చెప్పుకొచ్చారు. తెలుగు భాష కోసం ఐదుగురు మహనీయులు కృషి చేశారని.. త్యాగాలు చేశారని వెల్లడించారు. గిడుగు రామ్మూర్తి నాయుడు, కందుకూరి వీరేశలింగం పంతులు, పొట్టి శ్రీరాములు, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, మాజీ ముఖ్యమంత్రి యన్టీఆర్ చిత్రాలు తన జై తెలుగు రాజకీయ జెండాలో, ఎజెండాలో ఉంటాయన్నారు.తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని నిలబెట్టిన వారు ఎందరో ఉన్నా.. ఈ ఐదుగురు ముందు వరుసలో ఉంటారని జొన్నవిత్తుల అన్నారు. మన భాషా సంస్కృతి వైభవం గురించి నేడు ఎవ్వరికీ తెలియని పరిస్థితి నెలకొందన్నారు. నాడు మదరాసీలు అన్నారని.. నేడు హైదరాబాదీలు అనిపించుకుంటున్నామన్నారు. కానీ తెలుగు వాళ్లం అని మాత్రం అనిపించులేక పోతున్నామన్నారు. మన భాషను మనమే విస్మరించి చులకన చేసుకున్నామని జొన్నవిత్తుల పేర్కొన్నారు. తెలంగాణ భాష మొత్తం ఒక్కటే.. ఏపీలో మాత్రం ప్రాంతాల వారీగా భాష మారిపోతుం దన్నారు. ఉత్తరాంధ్ర, గోదావరి, కృష్ణా-గుంటూరు, నెల్లూరు, రాయలసీమ ఐదు రకాల భాషలు ఏపీకి ఉన్నాయన్నారు. తెలుగు భాషకు పునర్వైభవాన్ని తీసుకురావాలనేదే తన సంకల్పమన్నారు. మన భవిష్యత్తు తరాలకు మన తెలుగు భాషను అందించాలన్నారు. లక్షల కోట్ల బడ్జెట్, అధికారం ఉన్న ప్రభుత్వాలు తెలుగు భాషకు సమున్నత స్థానం కల్పించాలన్నారు. మాతృ భాష పరిరక్షణ .. రాజకీయ నాయకుల బాధ్యత అన్నారు. ఆగస్ట్15 నాటికి తమ పార్టీ విధివిధానాలు ప్రకటిస్తామన్నారు. తెలుగు భాషా పరిరక్షణ అజెండాతో వచ్చే ఎన్నికలలో పోటీ చేస్తామని జొన్నవిత్తుల ప్రకటించారు.

# విద్యుత్ పై వామపక్షాల ఆందోళనకు సిద్ధం

**నెల్లూరు :**

ఏపీ ప్రభుత్వంపై ప్రజలపై రకరకాల పేర్లతో విద్యుత్ ఛార్జీల భారాన్ని మోపడాన్ని నిరసిస్తూ వామపక్షాలు పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమవుతున్నాయి. ఏడాదిన్నర వ్యవధిలోనే మూడు దఫాలుగా ట్రూ అప్ ఛార్జీలను వసూలు చేయడానికి అనుమతించడంపై పెద్ద ఎత్తున పోరాడాలని నిర్ణయించాయి.రకరకాల పేర్లతో విద్యుత్ ఛార్జీలకు అదనపు వసూళ్లను జోడిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా వామపక్షాలు ఆందోళనకు సిద్ధమవుతున్నాయి. ప్రజలపై మోపిన విద్యుత్ చార్జీల పెంపును ప్రతిఘటించాలని వామపక్షాల రాష్ట్ర సదస్సులో నిర్ణయించారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోపుతును భారాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని కోరారు. ఈ నెల 30వ తేదిన రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కార్యాలయాలు లేదా సబ్‌స్టేషన్‌ల వద్ద ధర్నాలు చేపట్టాలని, జిల్లాల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలతో పాటు, సంతకాల సేకరణ, శాసన సభ్యులకు మెమోరాండాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు.విద్యుత్ చార్జీల పెంపుదలను వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో విజయవాడలో సదస్సు నిర్వహించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించి, ప్రధాన తీర్మానాన్ని సదస్సు ముందు ప్రతిపాదించారు. కేంద్రప్రభుత్వానికి సిఎం జగన్ మద్దతు పలకుతూ ప్రజలపై విద్యుత్ భారాలు మోపుతున్నారని విమర్శించారు.బిజెపి పాలిత రాష్ట్రాలే అమలు చేయని విద్యుత్ సంస్కరణలు, ప్రైవేటీకరణ విధానాలను ఏపీలో అమలు చేస్తున్నారని విమర్శించారు. గతంలో ప్రపంచ బ్యాంకు షరతులకు చంద్రబాబు నాయుడు తలొగ్గి విద్యుత్ సంస్కరణలు అమలు చేస్తే ఇప్పుడు కేంద్రప్రభుత్వం షరతులకుజగన్ తలొగ్గారని తెలిపారు.ఏపీలో మోడీ, జగన్ కలిసి కొత్త రూపాల్లో భారాలు మోపుతూ ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ చార్జీల భారం భరించలేక చిన్న పరిశ్రమలు, చేతివృత్తిదారులు దివాళా తీశారని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ పంపుసెట్లకుమీటర్లు బిగించడాన్ని వ్యతిరేకించిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి తనయుడి ప్రభుత్వం ఇప్పుడు మీటర్లను బిగిస్తున్నదని ఆరోపించారు.కేంద్రం తీసుకొచ్చే సంస్కరణల వల్ల పెట్రోల్, డీజిల్ చార్జీలు రోజువారీ ఎలా వడ్డిస్తున్నారో విద్యుత్ చార్జీలు కూడా అలానే మోపే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రారంభ దశలోనే వీటినితిరస్కరిస్తే ప్రజలపై భారాలు పడవని చెప్పారు. పార్టీలకు అతీతంగా విద్యుత్ భారాలపై పోరాటాలు నిర్వహించాలని కోరారు. అప్పుడే ప్రభుత్వం భారాలపై వెనకడుగు వేస్తుందన్నారు. కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ చట్టసవరణ బిల్లును వ్యతిరేకించాలని రాష్ట్రంలోని ఎంపిలకు వినతిపత్రాలు ఇవ్వాలని కోరారు.సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ విద్యుత్ సంస్కరణల అమలు చేసేందుకు జగన్‌కు ఎందుకంత ఉత్సాహమని ప్రశ్నించారు . అధికారంలోకి వస్తే విద్యుత్ భారాలు మోపనని ఇప్పటి వరకు సుమారు రూ.50వేల కోట్ల భారాలను ప్రజలపై మోపారని తెలిపారు. ఈ భారాలను ఎందుకు మోపారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం గజదొంగలాగా పట్టపగలే ప్రజలను దోచుకుంటున్నారని మండిపడ్డారు. తక్కువ ధరకే విద్యుత్ దొరుకుతున్నా మార్కెట్‌లో అధిక ధరకుకొనుగోలు చేస్తున్నారని విమర్శించారు. అదానీ కంపెనీతో కుమ్మక్కయ్యారని, ట్రాన్స్‌మిషన్ల మరమ్మత్తులు చేసే షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్‌కు స్మార్ట్‌మీటర్ల టెండర్ అప్పగించారని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల పేరుతో రూ.17వేల కోట్ల భారాలు ప్రజలపై మోపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చండీఘర్, రాజస్థాన్ రాష్ట్రాల్లో రూ.10వేల లోపు ఉన్న స్మార్ట్‌మీటర్‌ను ?పీలో రూ.37వేలతో ఎందుకు కొనుగోలు చేస్తున్నారో సమాధానం చెప్పాలని నిలదీశారుసిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ప్రతిపాదించిన తీర్మానాలను సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. సర్దుబాటు చార్జీల విధానమే రద్దు చేయాలని, ట్రూఅప్, సర్దుబాటు చార్జీల వసూళ్లు నిలిపివేయాలని తీర్మానించింది. విద్యుత్ రంగ ప్రైవేటీకరణను ప్రభుత్వాలు విరమించాలని, వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ మీటర్లు పెట్టద్దని డిమాండ్ చేసింది.ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా ఎస్సి,ఎస్టి, బిసి, వృత్తిదారులకు అన్ని రకాల రాయితీలు సంపూర్ణంగా అమలు చేయాలని తీర్మానించింది. గృహ వినియోగదారులందరికీ 100 యూనిట్లు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేసింది. విద్యుత్ పంపిణీ సంస్థలకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేసింది.అదానీతో సహా వివిధ కార్పొరేట్ సంస్థలతో చేసుకున్న అడ్డగోలు విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని తీర్మానించింది. కేంద్రప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విద్యుత్ సంస్కరణలను ఉపసంహరించాలని డిమాండ్ చేసింది. కేంద్ర విద్యుత్ చట్ట సవరణ బిల్లు–2022 ప్రతిపాదనలను ఉపసంహరించాలని తీర్మానించింది. ఈ కోర్కెల సాధనకై ఐక్యంగా ఉద్యమం సాగించాలని పిలుపునిచ్చింది.

# 500 విమానాలకు ఆర్డరిచ్చిన ఇండిగో

**ముంబై :**

భారత విమానయాన చరిత్రలోనే అతిపెద్ద ఒప్పందం జరిగింది. భారత బడ్జెట్ విమానయాన సంస్థ ఇండిగో.. ఒకేసారి 500 విమానాలను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ప్రముఖ విమాన తయారీ సంస్థ ఎయిర్‌బస్ నుంచి నారో బాడీ ఫ్లైట్ల కొనుగోలుకు డీల్ కుదుర్చుకుంది. టాటా గ్రూప్ నుంచి ఎయిరిండియా.. ఇటీవల ఎయిర్‌బస్, బోయింగ్ నుంచి 470 విమానాలకు ఆర్డర్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇదే అప్పటివరకు దేశ ఏవియేషన్ హిస్టరీలో అతిపెద్ద డీల్ కాగా.. ఇప్పుడు ఇండిగో దానిని అధిగమించి నట్లయింది. ప్రస్తుతం ఇండిగో 300 విమానాలు నడుపుతోంది. అంతకుముందు 480 విమానాలకు ఆర్డర్ ఇచ్చింది. ఇవి డెలివరీ కావాల్సి ఉండగా.. ఇప్పుడు ఆర్డర్ చేసిన 500 విమానాలు అదనం.కొత్తగా ఆర్డర్ చేసిన 500 విమానాలు.. 2030–2035 మధ్య డెలివరీ కావాల్సి ఉందని ఇండిగో తెలిపింది. ఇక మొత్తంగా రానున్న పదేళ్ల కాలంలో ఇండిగో ఆర్డర్ బుక్‌లో ఉన్న 1000 వరకు విమానాలు డెలివరీ అవుతాయని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పుడు ఆర్డర్ ఇచ్చిన విమానాల్లో ఎ320 నియో, ఎ321 నియో, ఎ321 ఎక్స్‌ఎల్ఆర్ ఫ్లైట్స్ ఉన్నాయి. ఈ ఒప్పందానికి సంబంధించిన ఆర్థిక వివరాలేం తెలియనప్పటికీ దీని వాల్యూ సుమారు 50 బిలియన్ డాలర్లుగా ఉంటుందని ఒక అంచనా.కరోనా సమయంలో విమానయాన పరిశ్రమ తీవ్రంగా దెబ్బతినగా.. మళ్లీ అంతేవేగంతో కోలుకుంది. విమాన ప్రయాణాలు కూడా భారీగా పుంజుకున్నాయి. ఈ నేపథ్యంలోనే విమానయాన సంస్థలు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని.. భారీ ఎత్తున విమానాల కోసం ఆర్డర్ పెడుతున్నాయి. ఇందులో భాగంగానే.. ప్రభుత్వం నుంచి ఎయిరిండియాను కొనుగోలు చేసిన టాటాలు ఏకంగా 470 విమానాలకు ఆర్డర్ పెట్టగా.. ఇప్పుడు ఇండిగో 500 విమానాలకు ఆర్డర్ ఇచ్చింది. దేశీయ విమానయాన రంగంలో ఇండిగోకు ప్రస్తుతం 56 శాతం వాటా ఉంది.

# పోలీసులపైనే లైంగిక వేధింపుల కేసు నమోదు


**పూతలపట్టు**

పూతలపట్టు పోలీసులపై లైగింక వేధింపుల కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే గత కొన్నిరోజుల క్రితం కల్లూరు వద్ద భారీ చోరి జరిగింది. దీనిపై దర్యాప్తు ప్రారంభించిన పూతలపట్టు ఎస్సై హరిప్రసాద్ తన బృందంతో కలిసి తమిళనాడు వెళ్లి నిందితులను అదుపులోకి తీసుకుని విచారించారు. సదరు కేసులో పూమది, అయ్యప్పతో సహా ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులలో నలుగురు మహిళలున్నారు. విచారణ అనంతరం పోలీసులు ఇద్దరిని రిమాండ్కు పంపి మరో నలుగురికి నోటీసులిచ్చి పంపించారు. అయితే తమను ఏపీ పోలీసులు లైంగికంగా వేధించి హింసించారని తమిళనాడులోని క్రిష్ణగిరి పోలీసులకు వారు ఫిర్యాదు చేశారు. దీంతో చిత్తూరు ఎస్పీ రిశాంత్ రెడ్డితో కృష్ణగిరి పోలీసులు మాట్లాడారు.దాంతో జిల్లా ఎస్పీ ఈ వ్యవహారంపై దర్యాప్తు ప్రారంభించారు.ప్రస్తుతం కృష్ణగిరి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల నుంచి ప్రాథమిక నివేదక ఇవ్వాలని నగరి అర్బన్ సీఐ వాసంతిని ఆదేశించారు. ఈ మేరకు పూతలపట్టు ఎస్సై హరిప్రసాద్, కానిస్టేబుల్ తనికాచలంతో పాటు మరో నలుగురిపై చిత్తూరు 2 టౌన్ పోలీస్ స్టేషన్లో లైంగిక వేధింపుల కేసు నమోదు చేశారు.

# జనరల్ నుంచి ప్రవీణ్ కుమార్ పోటీ...?

**అదిలాబాద్ :**

సిర్పూర్ సీటు నుంచి పోటీ చేసేందుకు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ రెడీ అవుతున్నారు. ఏదైనా ఎస్సీ రిజర్వుడు సీటు నుంచి పోటీ చేస్తారని అంతా భావించినప్పటికీ? ఆయన అనూహ్యంగా జనరల్ సీటు నుంచి బరిలో ఉంటానని చెప్పటం ఆసక్తికరంగా మారింది.మరికొద్ది నెలల్లోనే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల యుద్ధం మొదలుకాబోతుంది. ఇప్పటికే ప్రధాన పార్టీలు... వ్యూహాలు, ప్రతివ్యూహాలను సిద్ధం చేస్తున్నాయి. పోటీలో నిలిచే గెలిచే వారి జాబితాను కూడా రెడీ చేసుకునే పనిలో పడ్డాయి. కీలకమైన స్థానాల విషయంపై కూడా మేథోమథనం చేస్తున్నాయి. ఓ రకంగా చెప్పాలంటే... ఇప్పటికే ఎన్నికల మూడ్ లోకి వెళ్లిన పార్టీలన్నీ ప్రత్యర్థిని ఢీకొట్టే దిశగా అడుగులు వేస్తున్నాయి. ఇక పార్టీ అధినేతలు పోటీ చేసే స్థానాలపై కూడా చర్చ మొదలైంది. అయితే ఐపీఎస్ ఉద్యోగానికి రాజీనామా చేసి...బీఎస్పీతో పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్... వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు రెడీ అయిపోతున్నారు. తాజాగానే పోటీ చేసే సీటుపై కూడా కీలక ప్రకటన చేశారు. ఇది కాస్త.... పొలిటికల్ సర్కిల్ లో ఆసక్తికరంగా మారింది. అయితే పక్కా లెక్కలతోనే ఆర్ఎస్పీ అడుగులు వేస్తున్నారన్న టాక్ షురూ అయింది.వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సిర్పూర్ సీటు నుంచి బరిలోకి దిగేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్. గత కొంతకాలంగా కూడా... ఆ



నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. పలు కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు పార్టీ శ్రేణులను సమాయత్తం చేసే పనిలో పడ్డారు. తాజాగా కూడా 'పల్లెపల్లెకు బీఎస్పీ– ప్రగతిభవన్‌కు ఆర్ఎస్పీ' కార్యక్రమాన్ని చేపట్టిన ఆర్ఎస్పీ.... జగిత్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఇదే సమయంలో బెజ్జూర్ లో నిర్వహించిన భారీ ర్యాలీలో మాట్లాడిన ఆయన... ప్రజలు ఆశీర్వదిస్తే సిర్పూర్ నుంచి పోటీ చేస్తానని ప్రకటించారు. ఇది కాస్త.... జిల్లా రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. అయితే ఆర్ఎస్పీ... ఇదే సీటును ఎంచుకోవటానికి కారణాలు ఏంటన్న దానిపై చర్చ జరుగుతోంది.ఆర్ఎస్పీ పోటీ చేసేందుకు ఆసక్తి చూపటానికి పలు ప్రధాన కారణాలు తెరపైకి వస్తున్నాయి. జనరల్ స్థానమైన సిర్పూర్ నియోజకవర్గం నుంచి 2014 లో బీఎస్పీ అభ్యర్థి కోనేరు కోనప్ప ఎమ్మెల్యేగా అనూహ్య విజయం సాధించారు. ఆ తరువాత... గులాబీ గూటికి చేరారు. అయితే ఆ ఎన్నికల సమయంలో.... పలు గ్రామాల్లో పార్టీ సింబల్( ఏనుగు) సుపరిచితమైంది. ఇదే కాకుండా.... ఇక్కడ ఎస్సీ ఓటు బ్యాంక్ ఎక్కువగా ఉండటం కూడా మరో కారణంగా తెలుస్తోంది. అంతేకాకుండా... స్థానికంగా ఉన్న పలు పరిశ్రమల్లో ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వారు పని చేస్తున్నారు. వీరిలో ఎక్కువ ఉంది బహుజన వాదాన్ని విశ్వసించే వారు ఉండటం కూడా.... పార్టీకి కలిసి వస్తుందన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఆదివాసీ, గిరిజన ఓటు బ్యాంక్ పై కూడా బీఎస్పీ ఫోకస్ పెట్టింది. ఇక స్థానికంగా ఉన్న ఎమ్మెల్యే కోనప్ప... అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తోంది. ఆదివాసీ, గిరిజనులపై నమోదైన కేసుల విషయాన్ని కూడా ప్రజల్లోకి తీసుకెళ్తోంది. వీటికి తోడు బీసీల ఓట్లపై కూడా ఆశలు పెట్టుకుంది బహుజన సమాజ్ పార్టీ. ఇక మాజీ ఐపీఎస్ ఆఫీసర్ గా ప్రవీణ్ కుమార్ కు పేరు ఉండటంతో పాటు?గతంలో గురుకులాను అభివృద్ధి చేశారన్న పేరు ఉంది. వీటికి తోడు బీఆర్ఎస్ వైఫల్యాలపై కూడా గట్టిగా ప్రశ్నిస్తున్నారు. పేపర్ లీక్ కేసులోనూ సర్కార్ వైఫల్యాలను నిలదీస్తూ వస్తున్నారు. అన్ని అంశాలను అంచనా వేసిన తర్వాతనే?. జనరల్ సీటుగా ఉన్న సిర్పూర్ నుంచి పోటీ చేయాలని ఆర్ఎస్పీ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.మొత్తంగా సిర్పూర్ నుంచి పోటీ చేసేందుకు ఆర్ఎస్పీ సిద్ధమవుతున్నప్పటికీ?. పార్టీ పరంగా అధికారికంగా ప్రకటన రావాల్సి ఉంది. అయితే ఎన్నికల వేళ? ఎలాంటి పరిణామాలైన చోటు చేసుకోవచ్చు.

# రాష్ట్రంలో పూర్తిగా క్షీణించిన శాంతిభద్రతలు

**- సత్యసాయి జిల్లా బత్తలపల్లిలో వైసీపీ నేతల దాడిలో టీడీపీ కార్యకర్త సాకే రామయ్య మృతి బాధాకరం**

**పల్నాడులో ఉన్నం లక్ష్మీనారాయణపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం - కె.అచ్చెన్నాయుడు**

**అమరావతి**



అధికార మదంతో వైసీపీ నేతలు ప్రతిపక్ష టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దమనకాండకు పాల్పడుతూనే ఉన్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆరోపించారు. శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లిలో వైసీపీ శ్రేణులు రాళ్లు, కర్రలతో చేసిన దాడిలో టీడీపీ కార్యకర్త సాకే రామయ్య మృతి చెందడం అత్యంత బాధాకరం. వైసీపీ నేతల దుశ్చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాం. వ్యక్తి మరణానికి కారకులపై తక్షణమే చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా పల్నాడు జిల్లా కారంపూడి టీడీపీ మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, సైదాపై వైసీపీ నేతలు హత్యాయత్నానికి పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.
చింతపల్లికి చెందిన లక్ష్మీనారాయణ కారంపూడి బస్టాండ్ సెంటర్లో ఉండగా పథకం ప్రకారం వైసీపీ నాయకులు హత్యాయత్నానికి దిగారు. రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తున్న జగన్ రెడ్డి.. తమ అవినీతి, అక్రమాలను, విధ్వంసాన్ని ప్రశ్నించిన టీడీపీ నేతలు, కార్యకర్తలే లక్ష్యంగా భౌతిక దాడులు చేస్తూ హతమారుస్తున్నారు. శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయనేందుకు రాష్ట్రంలో జరుగుతున్న వరుస సంఘటనలే నిదర్శనం. తన సోదరిని వేధిస్తున్నారని ప్రశ్నించినందుకు పదో తరగతి చదివే అమర్ నాథ్ అనే బాలుడ్ని సజీవ దహనం చేశారు. కత్తిపోట్లు, హత్యలు, సజీవ దహనాలు, మానభంగాలు నిత్యకృత్యంగా మారాయి. హింసనే ఆయుధంగా చేసుకున్న వైసీపీకి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్ని విషయాన్ని గమనించాలని అయన అన్నారు.

# అక్టోబర్‌లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్

**హైదరాబాద్ :**

ఎన్నికలకు ముందు అధికార యంత్రాంగం భారీగాన్నే సన్నద్ధం కావాల్సి ఉంటుంది. పోలింగ్ స్టేషన్‌ల ఏర్పాటు, ఓటర్ల జాబితా రెడీ చేయడం, నియోజకవర్గాల వారీగా ఆర్వోలను నియమకం. సమస్యాత్మ ప్రాంతాలను గుర్తించి అక్కడ సెక్యూరిటీని ఏర్పాటు చేయడం కూడా ఇప్పటి నుంచే మొదలు పెట్టాలి. ఆరు నెలల ముందు నుంచే ఎన్నికల్లో విధులు నిర్వహించడానికి ఓకే చెప్పి వారికి ట్రైనింగ్ కూడా ఇవ్వాల్సి ఉంటుంది. ఈసారి అదనపు జిల్లా కలెక్టర్లకి కూడా బాధ్యతలు అప్పగించాలని ఎన్నికల సంఘం భావిస్తోంది. 74 మంది డిప్యూటీ కలెక్టర్లు, 14 మంది డిప్యూటీ కమిషనర్లు, 31 మంది అదనపు కలెక్టర్ల లిస్ట్‌ను రెడీ చేసింది. 119 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉన్న మండల తహసిల్దార్లకు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా విధులు అలాట్ చేయనున్నారు. వీళ్లు నామినేషన్లు స్వీకరించడం, పోలింగ్ సామగ్రిని సరఫరాల చేయడం, పోలింగ్‌బూత్‌ల ఏర్పాటు, ఈవీఎంలు, బ్యాలెట్ పేపర్లు రెడీ చేస్తారు. అక్టోబర్ 4న ఓటర్ల తుది జాబితాను ప్రచురిస్తారు. ఆ తర్వాతే షెడ్యూల్



వస్తుందని అధికారులు చెబుతున్నారు. 2018లో తెలంగాణ ప్రభుత్వం ముందస్తు ఎన్నికలకు వెళ్లింది. 2019 ఏప్రిల్‌లో ఎన్నికలు జరగాల్సి ఉండగా... 2018 సెప్టెంబర్ 6 న ప్రభుత్వాన్ని రద్దు చేసి ముందస్తుకు వెళ్లారు సీఎం కేసీఆర్. అప్పటికి ఉన్న రాజకీయ పరిస్థితుల కారణంగా ముందస్తుకు వెళ్లారు. ఆ సమయంలోనే నాలుగు రాష్ట్రాల ఎన్నికలు కూడా ఉన్నందున వాటితోపాటు తెలంగాణ అసెంబ్లీకి కూడా ఎన్నికల షెడ్యూల్‌ను ఈసీ ప్రకటించింది. అక్టోబర్ 6న ఎన్నికల షెడ్యూల్ వచ్చింది. నవంబర్ 12న నోటిఫికేషన్ జారీ చేశారు. డిసెంబర్ 7న పోలింగ్ నిర్వహించారు. 11న ఓట్ల లెక్కింపు జరిగింది. ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్ భారీ విజయాన్ని నమోదు చేసింది. ఈసారి కూడా ఆ నాలుగు రాష్ట్రాలతో కలిపి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మిజోరం, రాజస్థాన్‌కు తెలంగాణతోపాటు ఎన్నికలు జరగబోతున్నాయి. 2018లో ముందస్తు అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లిన కేసీఆర్.. ప్రభుత్వ రద్దు ప్రకటనతోపాటే ఆ ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీచేసే అభ్యర్థుల పేర్లను కూడా ప్రకటించేశారు. అప్పుడు ఎన్నికలకు సుమారు మూడు నెలల ముందే ఒకేసారి 105 మంది జాబితాను విడుదల చేయడం సంచలనం సృష్టించింది. అదే తరహాలో ఈసారి అసెంబ్లీ ఎన్నికలకు మూడు నెలల ముందే అభ్యర్థులను ప్రకటించేలా కేసీఆర్ కసరత్తు చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో పోటీ కోసం బీఆర్ఎస్‌లో తీవ్రపోటీ నెలకొనడం, సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో పనిమంతులకే తిరిగి టికెట్ దక్కుతుందని ఇప్పటికే స్పష్టతనిచ్చారు. చివరి నిమిషంలో టిక్కెట్లు ఖరారు చేస్తే అసంతృప్తి ప్రభావం చూపిస్తుందని మూడు నెలల ముందుగానే చెబితే.. వెళ్లేవాళ్లు వెళ్తారని ఉండేవాళ్లు ఉంటారని అనుకుంటున్నట్లుగా బీఆర్ఎస్ ఉన్నత స్థాయి వర్గాలు చెబుతున్నాయి

# బీసీ లను నట్టేట ముంచుతున్న కేంద్రం

**హైదరాబాద్**

దేశంలోని బీసీలను, వారి ప్రగతిని గాలికి వదిలివేసి అన్ని రంగాలలో ఈ వర్గాలను వెనుకకు నెట్టేసిన ఘనత కేంద్ర ప్రభుత్వానికే దక్కుతుందని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావువిమర్శించారు.దేశంలోని బీసీలు తాము ద్వితీయ శ్రేణి పౌరులమా అని కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసన వ్యక్తం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.మంగళవారం నగరంలోని ఇసిఐఎల్ ఆఫీసర్స్ అసోసియేషన్ బిల్డింగ్, కె.ఎం.రావు భవన్ లో అఖిల భారత ఓబీసీ ఉద్యోగుల జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా 75 ఏళ్ళ స్వాతంత్ర్య దేశంలో ఓబీసీ ల స్థితి గతులపై జాతీయ సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రబీసీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఆత్మీయ అతిథిలుగా అల్ ఇండియా ఓబీసీ ఉద్యోగుల ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి జి. కరుణానిధి, ఇతర ఉద్యోగ సంఘాల నేతలు పి. శ్రీనివాస్ గౌడ్, దామోదర చారి, చిన్నయ్య ముదిరాజ్, లైసనింగ్ ఆఫీసర్ శ్రీనివాస్, పి. పూర్ణ చందర్, జె. శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు. తొలుత మహాత్మా గాంధీ జ్యోతిభాపూలే చిత్ర పటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఇసిఐఎల్ ఓబీసీ ఓబిసి సంఘం ఉపాధ్యక్షుడు పి. శ్రీనివాస్ గౌడ్ మన్వయకర్తగా వ్యవహరించారుఈ సందర్భంగాముఖ్య అతిథిడాక్టర్ వకుళాభరణం ప్రసంగిస్తూ... మోడీ 10 ఏళ్ళ పాలనలోఓబీసీలు 20 ఏళ్ళు వెనకకు నెట్టి వేయబడ్డారుఅన్నారు. కులగణన చేపట్టబోము అనిచెప్పడం, బ్యాక్ లాగ్ విధానాన్ని అమలు చేయక పోవడం, ఓబీసీ లకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటుకు సన్నద్ధం కాకపోవడం, నాన్ క్రీమీ లేయర్ ఆదాయ పరిమితిని పెంచబోమనిచెప్పడం బీసీవర్గాలపై వ్యతిరేక చర్యలు కాకపోతే మరేమవుతుందని ఆయన కేంద్రాన్ని ప్రశ్నించారు.ఉద్యోగులంతా హక్కుల సాధనకు సంఘటితంగా పోరుబాటు పట్టాల్సిన సమయం ఆసన్నమైంది అన్నారు.

# పెరిగిన ఎండలు మండుతున్న కూరగాయల రేట్లు

**హైదరాబాద్ :**



ఎండలతో పాటు నగరంలో కూరగాయల ధరలూ భగ్గుమంటున్నాయి. రైతు బజార్లతో పాటు హోల్‌సేల్ మార్కెట్లలో రేట్లు అమాంతంగా పెరగడంతో సామాన్యులు విలవిలలాడుతున్నారు. గుడిమల్కాపూర్, బోయిన్‌పల్లి, సికింద్రాబాద్, ఎల్‌బీనగర్, మోండా మార్కెట్లతో పాటు సరూర్‌నగర్, మెహిదీపట్నం, ఎర్రగడ్డ, కూకట్‌పల్లి లాంటి రైతు బజార్లకు పెద్ద ఎత్తున కూరగాయలు వస్తుంటాయి. శివారులోని మొయినాబాద్, ఇబ్రహీంపట్నంతోపాటు ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి క్వింటాళ్ల కొద్దీ కూరగాయలు వస్తుంటాయి. సరూర్‌నగర్ రైతుబజార్‌కు సాధారణంగా నిత్యం 40 క్వింటాళ్ల టమాట, 30 నుంచి 35 క్వింటాళ్ల వరకు పచ్చిమిర్చి, వంకాయ 30 క్వింటాళ్లు, బెండకాయ 32 క్వింటాళు ,, క్యారట్ 35 క్వింటాళ్ల వరకు వస్తుంటాయి. పెరిగిన ఉష్ణోగ్రతల కారణంగా దిగుబడి లేకపోవడంతో ఇక్కడికి దిగుమతి కూడా భారీగా తగ్గింది. ప్రస్తుతం ఇదే రైతుబజార్‌లో సాధారణ రోజులతో పోల్చితే 40 శాతం దిగుమతి తగ్గిపోవడంతో ధరలు పెరిగాయి. రూ. వందకు కిలో టవటా, కిలో పచ్చిమిర్చి కూడా రావడం లేదని సామాన్యులు వాపోతున్నారు.

ఎండల తీవ్రతకు కోళ్లు చనిపోతున్నాయంటూ రెండు వారాలుగా వ్యాపారులు చికెన్ ధరను పెంచేశారు. ఆదివారం కూడా పలు ప్రాంతాల్లో స్కిన్‌లె?స కిలో రూ.280 నుంచి రూ.300 వరకు, లైవ్ కోడి రూ.190 నుంచి రూ.210 వరకు అమ్మారు. దీంతో చాలామంది చేపలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు. లైవ్‌ఫిష్ కిలో రూ.180, ఇతర చేపలు రూ.150, కొర్రమీను రూ.350 నుంచి రూ.400 వరకు విక్రయించడంతో వాటిని తీసుకునేందుకు మార్కెట్లకు భారీగా తరలివెళ్లారు.

మండుతున్న ఎండలతోపాటు కొత్త పంట రాకపోవడంతో ధరలు పెరుగుతున్నాయని సరూర్‌నగర్ రైతుబజార్ అధికారి స్రవంతి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఆగస్ట్ మొదటి వారం వరకు ధరలు ఇలాగే ఉంటాయని, వర్షాలు ప్రారంభమైన తర్వాత అందుబాటులోకి వస్తాయని చెప్పారు.

# బీఆర్ఎస్ నేతలకు ఐటీ నోటీసులు

**హైదరాబాద్ :**

ఐటీ విచారణకు రావాలంటూ బీఆర్ఎస్ నేతలకు నోటీసులు అందాయి. 84 గంటల పాటు పైళ్ల శేఖర్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి ఇళ్లు, కార్యాలయాల్లోనూ ఐటీ ముమ్మర తనిఖీలు నిర్వహించింది. సోదాల్లో స్వాధీనం చేసుకున్న పలు డాక్యుమెంట్స్, ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్స్ ఆధారంగా పైళ్ల శేఖర్‌రెడ్డికి ఐటీ నోటీసులు జారీ చేసింది. నేడు సంబంధిత వివరాలు, ఆధారాలతో హైదరాబాద్‌లోని ఐటీ ఆఫీస్‌లో విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో ఐటీ అధికారులు పేర్కొన్నారు. శేఖర్‌రెడ్డితోపాటు జనార్దన్‌రెడ్డి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి కూడా నోటీసులు ఇచ్చినట్టు సమాచారం. అయితే నేడు ఐటీ ముందు ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి హాజరు కానున్నారు. మర్రి జనార్దన్ రెడ్డి సమయం కోరనున్నారు. ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డిని గురువారం హాజరు కావాలని ఐటీ అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు.అధికార బీఆర్ఎస్ పార్టీ నేతలను ఆదాయ పన్ను (ఐటీ) శాఖ అధికారులు హడలెత్తించారు. 50 బృందాలుగా ఏర్పడిన అధికారులు ఏకకాలంలో బీఆర్ఎస్ ఎంపీ, ఇద్దరు ఎమ్మెల్యేలు, మరో నాయకుడి ఇళ్లలో సోదాలు చేశారు. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, నాగర్‌కర్నూలు ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, బీఆర్ఎస్ ముషీరాబాద్ నియోజకవర్గ నాయకుడు కొండపల్లి మాధవ్ (ఈయన 20 ఏళ్లు బీజేపీలో ఉన్నారు) ఇళ్లలో దాడులు చేశారు. ఆదాయ పన్ను లెక్కల్లో తేడాలుండడంతోనే ఈ సోదాలు చేసినట్లు సమాచారం. అయితే ఒకేసారి ముగ్గురు నేతల ఇళ్లలో ఐటీ దాడులు జరగడంతో బీఆర్ఎస్ నేతలు ఆందోళన చెందుతున్నారు. రెండేళ్ల కిందట కూడా బీఆర్ఎస్ నేతలకు ఐటీ అధికారులు షాక్ ఇచ్చారు. అప్పుడు కొందరు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు. సోదాలు పెద్దఎత్తున జరగకపోయినప్పటికీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఆందోళన చెందారు. తిరిగి వారం క్రితం ఏకకాలంలో ఒక ఎంపీ, ఇద్దరు ఎమ్మెల్యేలు, మరో నేత ఇళ్లు, సంస్థల్లో సోదాలు చేపట్టడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

# పాలకుర్తిలో మంత్రి ఎర్రబెల్లి విస్తృత పర్యటన

**పాలకుర్తి**

రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా తెలంగాణ విద్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మంగళవారం పాలకుర్తి నియోజక వర్గంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి నియోజకవర్గ వ్యాప్తంగా పలు స్కూల్స్ భవనాలను, గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభిస్తూ, విద్యా దినోత్సవ వేడుకలలో పాల్గొన్నారు. జనగామ జిల్లా, స్టేషన్ ఘనపూర్ మండలం రంగరాయ గూడెంలో స్థానిక శాసన సభ్యులు డాక్టర్ తాటికొండ రజయ్యతో కలిసి అంగన్వాడీ పాఠశాలను ప్రారంభించి, విద్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. జనగామ జిల్లా, పాలకుర్తి నియోజకవర్గం, కొడకండ్ల మండలం



లక్ష్మక్కపల్లి గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాల, పాలకుర్తి నియోజకవర్గం కొడకండ్ల మండలం పెద్ద బాయి తండా గ్రామపంచాయతీ భవనం, పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో బాలుర రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీని ప్రారంభించి, విద్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో గల హై స్కూల్ లో డిజిటల్ తరగతులు ప్రారంభించి, విద్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ వేడుకల్లో జనగామ జిల్లా కలెక్టర్ శివ లింగయ్య, ఆయా శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు,ప్రజలు, విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

**హైదరాబాద్**

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల పేరుతో బిఆర్ఎస్ ప్రభుత్వ నిధులు వెచ్చిస్తూ పార్టీ ప్రచార కార్యక్రమాలు చేపడుతున్న విషయం మీకు తెలిసిందే. అయితే ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను దశాబ్ది దగా పేరుతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వంపై నిరసన కార్యక్రమాలు చేపట్టాలని టీపీసీసీ నిర్ణయించింది.

ఈ నెల 22వ తేదీన అన్ని నియోజక వర్గ కేంద్రాలలో దశాబ్ది దగా పేరుతో కేసీఆర్ దిష్టి బొమ్మ ను రావణ సురుడిలాగా తయారు చేసి పది తలలు ఏర్పాటు చేసి తలలకు ప్రభుత్వ వైఫల్యాలను రాసి భారీ ప్రదర్శన తీసి దగ్ధం చెయ్యాలి. అనంతరం ఆర్.డి. ఓకు గాని, ఎమ్మార్వో కు గాని వినతి పత్రాలు అందించాలి. ఈ కార్య క్రమాలు చాలా పెద్దఎత్తున చేపట్టాలి. ఆయా పథకాల బాధిత ప్రజలు ఆ నిరసన ప్రదర్శనలో పాల్గొనేలా చర్యలు తీసుకోవా లి. నియోజకవర్గంలోని నాయకులంతా ఈ కార్యక్రమం విజయ వంతం అయ్యేలా కృషి చేయాలి. కేజీ నుంచి పీజీ ఉచిత నిర్బంధ విద్య, ఫీజ్ రీయంబర్స్ మెంట్, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, దళిత కుటుంబాలకు మూడు ఎకరాల భూమి, పోడు భూములకు పట్టాలు, రైతు రుణ మాఫీ, 12 శాతం ముస్లిం రిజర్వేషన్లు, 12 శాతం గిరిజన రిజర్వేషన్లపై ప్రభుత్వాన్ని నిలదీయాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# కడపలో స్కెచ్.. హైదరాబాద్ లో కిడ్నాప్

**హైదరాబాద్ :**

హైదరాబాద్ మల్కాజీగిరి బాలుడి కిడ్నాప్ కేసులో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. కిడ్నాప్ కు పాల్పడిన నిందితుల్లో నలుగురు పెద్ద వాళ్లు కాగా.. ఓ మైనర్ ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ బాలుడే కిడ్నాప్ చేయడంలో కీలక పాత్ర పోషించినట్లు సమాచారం. క్రికెట్ బాల్ కొందామని చెప్పి బయటకు తీసుకు వచ్చి మైనర్ బాలుడు.. హర్ష వర్ధన్ ను కారు ఎక్కించాడట. ఆపై కిడ్నాప్ చేసిన మొదటి రోజు బాలుడిని ఆలేరులోని ఓ ఫాం హౌజ్ లో నిందితులు దాచారు. అక్కడి నుంచి ఇంటికి వెళు ,న్నామని చెప్పి ఓ చోట నుంచి మరో చోటుకు కారులో తిప్పారు. హర్షవర్ధన్ కిడ్నాప్ కేసులో ప్రధాన నిందితుడు కడప జిల్లాకు చెందిన శివగా పోలీసులు గుర్తించారు. ఆన్ లైన్ ట్రేడింగ్ లో శివ భారీగా డబ్బు పోగొట్టుకున్నాడు. నష్టాన్ని పూడ్చుకోవడానికి కిడ్నాప్ కు ప్లాన్ చేశాడు. బాలుడి ప్లాన్ కు కడప నుంచి శివ స్కెచ్ వేయడంతో పాటు అక్కడి నుంచే ప్లాన్ ను అమలయ్యేలా చేశాడు. మైనర్ బాలుడితో సహా ఐదుగురు ముఠాగా ఏర్పడి.. కిడ్నాప్ చేశారు. అయితే తాము అనుకున్నట్లు కిడ్నాప్ సక్సెక్ అయి డబ్బు చేతికి రాగానే బాలుడు గతం గుర్తులు లేకుండా స్నేహితులతో కలిసి సర్జరీ చేయించాలని కూడా నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లో 8వ తరగతి విద్యార్థి అదృశ్యం తీవ్ర కలకలం రేపింది. మల్కాజీగిరిలో నివాసం ఉంటున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి కుమారుడు హర్ష వర్ధన్ ఈనెల 16వ తేదీన కనిపించకుండా పోయాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు 36 గంటల్లో కేసులు ఛేదించారు. సీసీటీవీ ఫుటేజీ, ఇతర వివరాల ఆధారంగా చేసుకొని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కారులో బాలుడిని కిడ్నాప్ చేసిన నలుగురు వ్యక్తులను రామన్నగూడెం వద్ద పోలీసులు పట్టుకున్నారు. బాలుడిని క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు.వరంగల్ లో బాలిక కిడ్నాప్ కలకలం రేగింది. వరంగల్ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగేంద్ర నగర్ లోని 4వ తరగతి చదువుతున్న ముతుల్ అనే బాలిక కొబ్బరి నూనె తెచ్చేందుకు కిరాణా షాపు వెళ్లగా, అక్కడ గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు కర్చీఫ్ లో మత్తుమందు పెట్టి బాలికను కిడ్నాప్ చేశారు. బాలికను ఓ వ్యాన్లో తీసుకెళ్తున్న క్రమంలో వరంగల్ గణపతి ఇంజినీరింగ్ కళాశాల వద్ద దుండగులు వ్యాన్ ఆపి టీ తాగుతుండగా, బాలికకు స్పృహ రావడంతో వాళ్ల చెర నుంచి తప్పించుకొని పారిపోయి వచ్చింది. అక్కడే ఉన్న కొందరు వ్యక్తులు క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. టాటా ఏస్ లో వచ్చిన ముగ్గురు దుండగులు అక్కడి నుంచి పారిపోయారని స్థానికులు అంటున్నారు. ఈ ఘటనపై బాలిక తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. "పాప షాపునకు వెళ్లింది. అమ్మాయి రోడ్డు దాటేవరకూ అక్కడే నిలబడ్డాను. పది నిమిషాలు అయినా ఇంకా పాప రాలేదు. మా అబ్బాయిని పంపి షాపు వద్ద అడిగితే ఎవరు రాలేదని చెప్పారు. ఈ విషయాన్ని నా భర్తకు చెప్పాను. బంధువుల ఇంటికి వెళ్లిందేమోనని అక్కడ కూడా చూశాం, కానీ అక్కడికీ వెళ్లలేదు. ఇంతలో డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశాను. పాప వరంగల్ లో ఉందని ఫోన్ వచ్చింది. అక్కడికి ఎలా వచ్చిందని అడిగితే ఎవరో వ్యాన్ లో తీసుకొచ్చారని బాలిక చెప్పింది. దీనిపై పోలీసులు ఫిర్యాదు చేశాం. "– బాలిక తల్లి

# టిటిడి ట్రస్ట్ ను వ్యాపార సంస్థగా మార్చారు

**మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి**

**విశాఖపట్నం**

టిటిడి ట్రస్ట్ ను వ్యాపార సంస్థగా మార్చా రని.. నిధులు దారి మళ్లుతున్నాయని ఆరోపించారు టీడీ పీ సీనియర్ నేత, మాజీ మంత్రి బండారు సత్యనా యణమూర్తి అన్నారు.స్వా మికి అపచారం జరిగితే ఊరుకోమ ని... అవసరం అయితే జైలుకు వెళ్లడా నికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశా రు.శ్రీవాణి ట్రస్టు దోపి డీని ఆపాలన్నా రు. శ్రీవాణి ట్రస్టు ద్వారా ప్రతిరోజు 10 వేల రూపాయల విలువ గల టికెట్లు అమ్ముతున్నారని కానీ రసీదు ఇవ్వడం లేదని మండిపడ్డారు.ఈ వివరాల ను టీటీడీ వార్షిక బడ్జెట్లో పెట్టడం లేదని తెలిపారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా ఇప్పటి వరకు ఎన్ని టికెట్లు అమ్మా రో.. ఎంత డబ్బులు వచ్చాయో టీటీడీ ట్రస్టు చైర్మ న్ వైవీ సుబ్బారెడ్డి చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి పైసాకు లెక్క చెప్పాలని డిమాండ్ చేశారు.దేవుడు పేరు చెప్పి... స్వామి వారి నిధులు మళ్లిస్తున్నారని మండిపడ్డారు.విశాఖ కిడ్నాప్ వ్యవహారంపై సీఎం స్పందించాలని... దీనిపై సీబీఐ విచారణ జరపాలని బండారు సత్నారాయణ మూర్తి డిమాండ్ చేశారు.

# పార్టీ పెట్టి పది మంది ప్రేమ పొందాలి

**విజయవాడ :**

జనసేన అధినేత పవన్ కల్యాణ్ కు కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం బహిరంగ లేఖ రాశారు. పార్టీ పెట్టి పది మంది ప్రేమ పొందాలే కానీ.. ఇలా వీధి రౌడీలా మాట్లాడడం ఎంత వరకు సమంజసం అంటూ ప్రశ్నించారు. కాపు రిజర్వేషన్ కోసం ఉద్యమాలు చేసి రాజకీయంగా ఎదుగుతున్నారంటూ పవన్ కల్యామ్ చేసిన వ్యాఖ్యలు సరికావని అన్నారు. కాపు ఉద్యమాన్ని తన ఎదుగుదలకు వాడుకోలేదని.. చిత్తశుద్ధితో ఫైట్ చేశానని చెప్పుకొచ్చారు. నేతలను విమర్శించడం మానేసి పవన్ అసలు విషయాలపై దృష్టి సారించాలని లేఖలో హితవు పలికారు. తాను కులాన్ని అడ్డు పెట్టుకొని నాయకుడిగా ఎదగలేదన్నారు. తాను యువతను వాడుకొని భావోద్వేగాలు రెచ్చగొట్టలేదని చెప్పుకొచ్చారు. ప్రభుత్వం మారినప్పుడుల్లా తాను ఉద్యమాలు చేయలేదన్నారు. పోగొట్టుకున్న బీసీ రిజర్వేషన్ పునరుద్ధరిస్తామనని చంద్రబాబు నాయుడి పదే పదే చెప్పడం వల్ల రోడ్డు మీదకు వచ్చామన్నారు. ఈ పరిస్థితిని బాబు ద్వారా పవన్ కల్పించారని ఆరోపించారు. తాను ఏ నాయకుడినీ బెదిరించి డబ్బులు సంపాదించలేదని చెప్పారు. ఎమ్మెల్యేని తిట్టడం ఆపేసి.. ఆ సమస్యలపై దృష్టి పెట్టండి!తన కంటే చాలా బలవంతుడైన పవన్ కల్యాణ్ తాను వదిలేసిన ఉద్యమాన్ని చేపట్టి యువతకు రిజర్వేషన్ ఫలాలు ఎందుకు తీసుకురాలేదో చెప్పాలని ముద్రగడ ప్రశ్నించారు. ఎమ్మెల్యేని తిట్టడం ఆపేసి.. విశాఖ స్టీల్ ప్లాంట్ కాపాడడం, ప్రత్యేక రైల్వే జోన్, కడప స్టీల్ ప్లాంట్ వగైరా సమస్యలు సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించాలని కోరారు. జనసేనానికి నిజంగా రాష్ట్ర ప్రజలపై ప్రేమ ఉంటే వీటిపై యుద్ధం చేయండంటూ కోరారు. తన లాంటి అనాథల మీద విమర్శలు చేయడం సరికాదని సూచించారు.పార్టీ పెట్టిన తర్వాత పదిమంది ప్రేమ పొందాలే కానీ వీధి రౌడీ భాషలో మాట్లాడడం ఎంత వరకూ న్యాయమంటారని అడిగారు. అలాగే రాజకీయాల్లో అతి సామాన్యుడు తాలూకు ఇంటికి వెళ్లి ఓట్లు అడుక్కోవాలని... ఉద్యామాలకు అయితే ఎవరి ఇంటికి వెళ్లి సాయం చేయాలని అడగాల్సిన అవసరం లేదన్నారు. మనం చేసే ఉద్యమం మంచి కోసం చేస్తే కులాలకు అతీతంగా బలపరిచేవారు చాలా మంది ఉన్నారని తెలిపారు.పవన్ కల్యాణ్ ప్రసంగాల్లో పదే పదే.. తొక్క తీస్తా, నార తీస్తా, కింద కూర్చోబెడతా, గుండు గీయిస్తా అంటున్నారని గుర్తు చేశారు. ఇప్పటి వరకు ఇలా ఎంత మందిని కొట్టారో, ఎంత మందికి గుండు గీయించి, కింద కూర్చోబెట్టారో చెప్పాలని ముద్రగడ పద్మనాభం ప్రశ్నించారు. పవన్ రాజకీయ యాత్ర ప్రారంభం నుంచి కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, ఆయన తండ్రి, తాతది తప్పుడు మార్గాల్లో సంపాదన అనే మాట చాలా తప్పు అని అన్నారు. ద్వారంపూడిపై గెలిచి పవన్ కల్యాణ్ సత్తా ఏమిటో చూపించాలని అన్నారు.

# వెలుగులోకి పూర్ణానంద స్వామి ఆగడాలు

**విశాఖపట్టణం:**

విశాఖపట్నం జిల్లాలోని వెంకోజీపాలెం జ్ఞానంద ఆశ్రమం పూర్ణానంద స్వామిపై లైంగిక వేధింపుల ఆరోపణలు వాస్తవమేనని స్థానిక 15 వ వార్డు కార్పొరేటర్ శ్రీ విద్య తెలిపారు. ఆయన ఉపాధ్యాయుడిగా పని చేసినప్పుడే పిల్లలను లైంగికంగా వేధించేవాడని గుర్తు చేశారు. స్వామిగా మారి పూర్ణానంద చేస్తున్న అరాచకాలు చాలా దారుణం అన్నారు. తన దగ్గర కాల్ రికార్డ్స్ కూడా ఉన్నాయని శ్రీవిద్య వివరించారు. మైనర్ అమ్మాయిలను కంప్యూటర్ క్లాస్ అని తీసుకెళ్లి.. తాక రాని చోట తాకేవాడన్నారు. వాళ్లపై ఎక్కడ పడితే అక్కడ చేతులు వేసి అసభ్యంగా ప్రవర్తించే వారని పేర్కొన్నారు.. ఆశ్రమంలో కొంతమంది అబ్బాయిలు, ఓ మహిళ కలిసి ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశారని వెల్లడించారు. గతంలో 100 మందిగా ఉన్న పిల్లలు... పూర్ణానంద పెట్టే టార్చర్ భరించలేక వెళ్లిపోయారని అన్నారు. మత గురువుల పేరిట ఇలా మైనర్లను లైంగికంగా హింసిస్తున్న వారిని కఠినంగా శిక్షించాలి కార్పొరేటర్ శ్రీ విద్య డిమాండ్ చేశారు.

రాజమహేంద్రవరానికి చెందిన 15 ఏళ్ల బాలిక తల్లిదండ్రులు చిన్న వయసులోనే చనిపోయారు. దీంతో బంధువులు ఆ బాలికను ఐదో తరగతి వరకు చదివించి రెండేళ్ల క్రితం విశాఖలోని కొత్త వెంకోజీపాలెం వద్ద ఉన్న జ్ఞానానంద ఆశ్రమంలో చేర్పించారు. అయితే ఆ ఆశ్రమ నిర్వాహకుడు పూర్ణానంద స్వామిజీ బాలికతో ఆవులకు మేత వేయించడం, పేడ తీయడం వంటి పనులను చేయించేవారు. అర్ధరాత్రి అయ్యాక తనతో పాటు గదిలోకి తీసుకెళ్లి అత్యాచారం చేసేవారు. ఏడాది నుంచి బాలికను తన గదిలోనే కాళ్లకు గొలుసు వేసి బంధించి ఎదురు తిరిగితే కొట్టేవారు. కేవలం రెండు రెండు చెంచాల అన్నాన్ని నీటితో కలిపి మాత్రమే పెట్టేవారు. రెండు వారాలకు ఒకసారి మాత్రమే స్నానానికి వెళ్లాల్సి వచ్చేది. కాలకృత్యాలకు అనుమతించేవాడు కాదు. బకెట్ లోనే కానివ్వాల్సి పరిస్థితి. ఇలా గత రెండేళ్లుగా తీవ్ర వేధింపులకు గురి చేశారు. అయితే ఈ విషయాన్ని గుర్తించిన పని మనిషి బాలికకు సాయం చేసి ఈ నరకం నుంచి బయట పడేసింది. ఈనెల 13వ తేదీన తిరుమల ఎక్స్ ప్రెస్ ఎక్కగా.. తనకు పరిచయమైన ఓ ప్రయాణికురాలికి తన బాధను చెప్పుకుంది. ఆ




మహిళ రెండు రోజుల క్రితం కృష్ణా జిల్లా కంకిపాడులోని హాస్టల్ లో చేర్చేందుకు ప్రయత్నించగా.. పోలీస్ స్టేషన్ నుంచి లేఖ తీసుకొస్తేనే అనుమతిస్తామని చెప్పడంతో వారు కంకిపాడు పీఎస్ కు వెళ్లారు. పోలీసులు ఇచ్చిన లేఖను తీసుకొని బాలల సంక్షేమ కమిటీకి బాలికను తీసుకెళ్లగా.. ఆశ్రమంలో అనుభవించిన నరకాన్ని వారికి బాలిక తెలిపింది. దీంతో సీడబ్ల్యూసీ సభ్యులను బాలికను విజయవాడలోని దిశ పోలీస్ స్టేషన్ కు పంపించగా పూర్ణానంద స్వామిజీపై పోక్సో కేసు నమోదు చేశారు. అనంతరం ఆమెను వైద్య పరీక్షల నిమిత్తం విజయవాడ పాత ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మరోవైపు విశాఖ పోలీసులు స్వామీజీని అరెస్ట్ చేశారు.

# మంగళవారం మహాలక్ష్మి పుట్టడం సంతోషం



మెగాస్టార్ చిరంజీవి ఇంట సంబరాలు మొదలైయ్యాయి. రామ్ చరణ్ తండ్రి అయ్యారు. ఉపాసన మంగళవారం పండంటి పాపకు జన్మనిచ్చింది. హైదరాబాద్ జూబ్లిహిల్స్ లోని అపోలో ఆసుపత్రిలో ఉపాసనకు డెలివరీ అయింది. మహాలక్ష్మి రాకతో మెగా ఇంట ఆనందాలు వెల్లువెత్తాయి. అలాగే టాలీవుడ్ ప్రముఖులు రామ్ చరణ్ ఉపాసన జంటకు శుభాకాంక్షలు చెబుతున్నారు. మనవరాలి రాకతో మెగాస్టార్ చిరంజీవి ఆనందంలో మునిగితేలుతున్నారు. గ్రాండ్ డాటర్ కు వెల్కమ్ చెబుతూ ఇంతకుముందే ట్వీట్ చేసిన చిరు ముద్దుల మనవరాలిని చూడటానికి ఆసుపత్రికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన చిరంజీవి.. ఈ వార్త తమ కుటుంబానికి ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. అంతేకాదు తమ కుటుంబానికి ఎంతో ఇష్టమైన రోజే మనవరాలు జన్మించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఉపాసన డెలివరీ డేట్ ప్రకటించినప్పటినుంచీ అందరిలోనూ ఆసక్తి నెలకొంది. డెలివరీకు రోజులు దగ్గరపడుతున్నకొద్దీ మెగా ఫ్యామిలీతో పాటు అందరిలోనూ ఉత్కంఠ మొదలైంది. అందరూ అనుకున్నట్టుగానే మంగళవారం (జూన్ 20) తెల్లవారుజామున 4 గంటలకు ఉపాసన పండంటి పాపకు జన్మనిచ్చింది. ఈ మేరకు అపోలో వైద్యుల బృందం హెల్త్ బులిటెన్ ను ప్రకటించింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్టు బులిటెన్ లో పేర్కొంది. దీంతో మెగా ఇంట సంబరాలు మొదలైయ్యాయి. ఇదే విషయాన్ని మెగాస్టార్ చిరంజీవి చెప్పారు. తాము ఆంజనేయ స్వామిని ఆరాధిస్తామని, ఆ స్వామికి ఇష్టమైన రోజైన మంగళవారం నాడు పాప పుట్టడం సంతోషంగా ఉందన్నారు చిరు. మెగా ఫ్యామిలీ గురించి ఇండస్ట్రీలో అందరికీ తెలిసిందే. ఆ కుటుంబం ఎక్కువగా ఆంజనేయ స్వామిను కొలుస్తూ ఉంటారు. వాస్తవానికి చిరంజీవి అసలు పేరు శివ శంకర వరప్రసాద్ కానీ సినిమాల్లోకి వచ్చాక చిరంజీవి అని మార్చుకున్నారు. ఈ పేరు మార్పు గురించి పలు సందర్భాల్లో చిరంజీవి చెప్పారు కూడా. తర్వాత చాలా సినిమాల్లో చిరంజీవి కూడా హనుమంతుడి భక్తుడిగానూ కనిపించారు. అలాగే హనుమంతుడి పాటలు, ఆయన పేరును కూడా పలు సినిమాలకు పెట్టిన సందర్భాలు ఉన్నాయి. అలాగే పవన్ కళ్యాణ్ కూడా ఆంజనేయుడిని ఎక్కువగా పూజిస్తారు. ఇక రామ్ చరణ్ పెట్టిన కొణిదెల ప్రొడక్షన్ లోగో కూడా హనుమాన్ ప్రతిమ వచ్చేలా పెట్టడం విశేషం. ఇలా ప్రతీ సందర్భంలోనూ మెగా ఫ్యామిలీ హనుమంతుడిని తలచుకుంటూనే ఉంటుంది. ఈ నేపథ్యంలో మెగా గ్రాండ్ డాటర్ కూడా ఆ హనుమంతుడికి ప్రీతిపాత్రమైన మంగళవారం రోజు జన్మించడంతో మెగా ఫ్యామిలీ హర్షం వ్యక్తం చేస్తోంది. మనవరాలి రాకతో మెగాస్టార్ చిరంజీవి తాతయ్య పోస్ట్ కు ప్రమోట్ అయ్యారు. తన ముద్దుల మనవరాలిని చూడటానికి ఆసుపత్రికి కూడా వెళ్లారు చిరు. మహాలక్ష్మి రాక తమ కుటుంబంలో ఎంతో ఆనందాన్ని నింపిందన్నారు చిరంజీవి. పాప మంచి ఘడియల్లో పుట్టిందని, జాతకం కూడా చాలా బాగుందని అంటున్నారని పొంగిపోయారాయన. ఆ ప్రభావం ముందు నుంచీ తమ ఫ్యామిలీలో కనబడుతుందని చెప్పారు. రామ్ చరణ్ స్టార్ డమ్ ప్రపంచవ్యాప్తంగా పెరగడం, వరుణ్ తేజ్ నిశ్చితార్థం ఇలా అన్నీ శుభాలే జరుగుతున్నాయని అన్నారు. ప్రస్తుతం చిరంజీవి వ్యాఖ్యలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇవి చూసి మెగా అభిమానులు తెగ సంబర పడిపోతున్నారట.







Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950